
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 91 విశాఖపట్నం గురువారం 16 డిసెంబరు 2021 8 పేజీలు వెల : 5.00



## ఓబీసీ కులగణనకు కేంద్రం 'నో'

న్యూఢిల్లీ: దేశంలో వెనుకబడిన కులాల జనాభా గణనకు జనాభా లెక్కల సేకరణ (సెన్సెస్) సరైన సాధనం కాదని హెూం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ స్పష్టం చేశారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన జనాభాను మినహా కులాలవారీగా జనాభా లెక్కలను సేకరించలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలతో సంప్రదింపులు జరిపిన మీదట జనాభా లెక్కల సేకరణకు ప్రభుత్వం షెడ్యూలును రూపొందిస్తుందని (మిగతా 2లో..)





## పశ్చిమగోదావరి జిల్లాలో..
# ఘోర ప్రమాదం

ఏలూరు: పశ్చిమగోదావరి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. బుధవారం జంగారెడ్డిగూడెం సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి జల్లేరు వాగులో పడింది. బస్సు రెయిలింగ్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు మృతి చెందగా... పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో బస్సులో 58 మంది ప్రయాణికులు ఉన్నారని తెలుస్తోంది. ఘటన జరిగిన వెంటనే బస్సు కిటికీల నుంచి దూకి పలువురు ప్రయాణికులు ప్రాణాలు కాపాడుకున్నారు.

బస్సు వేలేరుపాడు పేట నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సు వాగులో పడిన వెంటనే స్థానికులు, వాహనదారులు, పోలీసులు, సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. పడవల సాయంతో ప్రయాణికులను స్థానికులు ఒడ్డుకు చేర్చారు.

## ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి..
### రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా



అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం జల్లేరు వాగులో బస్సు పడిపోయిన ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

**మంత్రి ఆళ్లనాని తీవ్ర దిగ్భ్రాంతి**

జిల్లేరు వాగులో బస్సు బోల్తా ఘటనలో 10 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడంపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి**

బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించే చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను మంత్రి ఆళ్ల నాని అదేశించారు. ఈ ప్రమాదంలో 20మందికి పైగా గాయపడిన వారికి మెరుగైన వైద్య సదుపాయం కోసం జంగారెడ్డిగూడెం గవర్నమెంట్ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా అధికారులు వెంటనే ఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి ఆళ్ల నాని ఆదేశించారు.

## గులాబ్ తుఫాన్ నష్టంపై ఏపీ సాయం కోరలేదు: కేంద్రం

ఢిల్లీ: గులాబ్ తుఫాన్ నష్టంపై కేంద్రాన్ని ఏపీ ప్రభుత్వం ఎలాంటి అదనపు ఆర్థిక సాయం కోరలేదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ రాజ్యసభలో తెలిపారు. బీజేపీ ఎంపీ టీజీ వెంకటేష్ అడిగిన ప్రశ్నకు నిత్యానంద రాయ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జాతీయ విపత్తు నిధి నుంచి అదనపు సహాయం కోరుతూ ఎలాంటి అభ్యర్థన తమకు అందలేదన్నారు. ఏపీ ప్రభుత్వం అందించిన సమాచారం మేరకు 'గులాబ్' తుఫాన్ కారణంగా 13,990 హెక్టార్లలో వంటనష్టం జరిగిందన్నారు. తుఫాన్ కారణంగా 1,909 ఇళ్లు దెబ్బ తిన్నాయన్నారు. తుఫాన్ తీవ్రతకు 9 మంది మృతి చెందరన్నారు. 116 పశువులు మృత్యువాత పడ్డాయని ఆయన తెలిపారు. విపత్తుల నిర్వహణలో ప్రాథమిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాదిలో రాష్ట్ర విపత్తు నిధి కోసం కేంద్రం వాటా రూ. 895.20 కోట్లు..రాష్ట్ర వాటా రూ. 297.60 కోట్లు కలిపి మొత్తం రూ. 1, 192.80 కోట్లు కేటాయించామని ఆయన పేర్కొన్నా రు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటాను అడ్వాన్సు రూపంలో ముందుగానే రాష్ట్రానికి విడుదల చేశామని నిత్యానందరాయ్ తెలిపారు.

## మున్సిపల్ స్కూళ్ల కష్టాలు ఇంతింత కాదయా

(వివరాలు 2లో..)

## సెమీకండక్టర్ల డిజైన్, తయారీ ప్రాజెక్టుకు రూ.76,000 కోట్లు : కేంద్రం



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. సెమీకండక్టర్లు, డిస్‌ప్లే బోర్డుల ఉత్పత్తి మన దేశంలోనే జరిగేందుకు రూ.76,000 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో సెమీకండక్టర్ చిప్స్ డిజైన్, తయారీ మన దేశంలోనే జరగబోతున్నాయి. కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాతో మాట్లాడుతూ, ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకంలో భాగంగా మన దేశంలో సెమీకండక్టర్ చిప్స్ డిజైన్, తయారీ కోసం రూ.76,000 కోట్లు కేటాయించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదించిందని చెప్పారు. రానున్న ఐదు లేదా ఆరు సంవత్సరాల్లో మన దేశంలోనే సెమీకండక్టర్ల ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు 'ప్రోగ్రామ్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ సెమీకండక్టర్స్ అండ్ డిస్‌ప్లే మాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్' అని పేరు పెట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల దేశవ్యాప్తంగా అనేక రంగాలపై అనేక రకాలుగా మంచి ప్రభావం పడుతుందని ప్రభుత్వం తెలిపింది. 2025నాటికి మన దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదపడుతుందని తెలిపింది. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేవిధంగా సెమీకండక్టర్లు, డిస్‌ప్లే మాన్యుఫ్యాక్చరింగ్, డిజైన్ కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో నూతన శకానికి ఈ కార్యక్రమం బాటలు పరుస్తుందని చెప్పింది.

## గవర్నర్‌ను పరామర్శించిన సీఎం జగన్



విజయవాడ: గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు పరామర్శించారు. బుధవారం సాయంత్రం రాజ్ భవన్‌కు చేరుకున్న సీఎం జగన్‌కి గవర్నర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, రాజ్ భవన్ సంయుక్త కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు. ఇటీవల కరోనా నుంచి కోలుకున్న గవర్నర్ దంపతులు.. హైదరాబాద్‌లో చికిత్స అనంతరం విజయవాడకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ దంపతులు.. గవర్నర్ దంపతులను కలిసి వారి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నామన్నారు. కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలని సీఎం జగన్ ఈ సందర్భంగా గవర్నర్‌కు సూచించారు. శాసన మండలి సభ్యుడు తలశిల రఘురామ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, విజయవాడ నగర పోలీస్ కమషనర్ కాంతి రాణా టాటా, ప్రోటోకాల్ డైరెక్టర్ బాల సుబ్రమణ్యం, రాజ్ భవన్ ఉప కార్యదర్శి సన్యాసి రావు తదితరులు అక్కడ ఉన్నారు.

## స్కూలు ప్రక్కన ట్రాన్స్ఫార్మర్ నిర్మాణ ప్రయత్నం




గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ : గుడివాడ సమీపంలోని ఏలూరు రోడ్డు మున్సిపల్ ప్రైమరీ స్కూల్ దగ్గర విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నిర్మాణానికి చకచకా పనులు జరుగుతున్నాయి. స్కూలు ఆవరణకు దగ్గరగా ఉండటంతో ఆ స్కూల్లో పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు. ఉపాధ్యాయులను సంప్రదించగా ఈ విషయము మా పరిధిలోని కాదు అని కొన్ని రోజులలో ఈ స్కూలు కనుమరుగుకానుంది అని సంప్రదించిన తల్లిదండ్రులకు అప్రస్తుత సమాదానం ఇవ్వడం జరిగింది అని వాపోతున్నారు. ఇదే విషయమై మా విలేఖరి ఆ ప్రదేశానికి వెళుతున్న విషయాన్ని గ్రహించిన అక్కడ పని వాళ్లు తట్టా బుట్టా సర్దుకొని వెళ్ళిపోయి నాయకుల ద్వారా సంప్రదింపులు జరుపుతున్నారని వార్తా సేకరణకు వెళ్లిన విలేఖరి వాపోయారు. బడి ఈడు చిన్నపిల్లలు చదువుచున్న పాఠశాల అని కూడా చూడకుండా పాఠశాల ప్రక్కనే ట్రాన్స్ఫార్మర్ నిర్మించడం పిల్లల ప్రాణాలతో చలగాటం ఆడటమే అని చుట్టుపక్కల ప్రజలు, (మిగతా 2లో..)



# కమ్మరం వర్కర్స్ యూనియన్ కార్మికులతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)

## గుడివాడలో కొలిమి పరిశ్రమల స్థాపనకు అనువైన స్థలాల గుర్తింపునకు చర్యలు మౌలిక సదుపాయాల సంస్థ అధికారులతోనూ మాట్లాడతా

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని



గుడివాడ,ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్15: గుడివాడ, డిసెంబర్ 15: గుడివాడ పట్టణంలో కొలిమి పరిశ్రమల స్థాపనకు అనువైన స్థలాల గుర్తింపునకు చర్యలు తీసుకుంటానని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. బుధవారం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణం రాజేంద్రనగర్లోని నివాసంలో మంత్రి కొడాలి నానిని కమ్మరం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కంచర్ల జాన్ బాబు, మాజీ కౌన్సిలర్ బూసి ప్రకాశరావు, నాయకులు బొమ్మిడి వెంకటేశ్వరరావు, మోపిదేవి రామరాజు, బీ దిలీపుమార్, బొమ్మిడి జగన్మోహనరావు, మేడా పరమేశ్వరరావు, కే తుఫాన్, టీ వెంకటేశ్వరరావు, బీ లక్ష్మీనారాయణ, శిరిపురపు ప్రకాష్, జమ్మలమూడి జింబో, జడా బాబూరావు తదితరులు కలిశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బూసి ప్రకాశరావు మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో కొలిమి పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు కమ్మరం కార్మికులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారన్నారు. ఇందుకు అవసరమైన స్థలాలను కేటాయించాలని మంత్రి కొడాలి నానిని కోరారు. ఆటోనగర్ ఏర్పాటు సమయంలో కమ్మరం కార్మికులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్థలాలను కొనుగోలు చేయలేకపోయారన్నారు. ఏపీఐఐసీ, మున్సిపాలిటీ, పంచాయతీ ద్వారా భూమిని సేకరించి, మౌలిక సదుపాయాలను కల్పించి 40 ఏళ్ళుగా కమ్మరం వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు అందజేయాలన్నారు. అభివృద్ధి చేసిన స్థలాలకు రేటును నిర్ణయిస్తే కొనుగోలు చేసేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గుడివాడలో కమ్మరం కార్మికులు తయారుచేసే వ్యవసాయ పరికరాలకు దేశవ్యాప్తంగా ఆదరణ ఉందని, స్థలాలు ఇచ్చి ప్రోత్సహించాలని బూసి ప్రకాశరావు కోరారు. అనంతరం మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ పామర్రు రోడ్డులో గుడివాడ రూరల్ మండలం బిళ్ళపాడు దగ్గర నుండి గుడివాడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వరకు ఫ్లై ఓవరు నిర్మిస్తున్నామని చెప్పారు. మచిలీపట్నం రోడ్డులో మల్లాయిపాలెం పరిధిలో దాదాపు 17 వేల మందికి ఇళ్ళపట్టాలను కేటాయించామన్నారు. ఈ ప్రాంతం కూడా త్వరితగతిన అభివృద్ధి చెందుతోందన్నారు. ఆటోనగర్ విస్తరణకు కూడా ఇబ్బందులు ఉన్నాయన్నారు. రిజర్వ్ సైట్లను పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించడం కుదరదని చెప్పారు. గుడివాడను ఆనుకుని, తక్కువ ధరకు భూమి లభిస్తే కమ్మరం కార్మికులకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ అధికారులతో మాట్లాడి కొలిమి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడతానన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని మంత్రి కొడాలి నాని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం క్రాంతికుమార్, మన్నేపల్లి ప్రేమ్ కుమార్, చినసత్యానందం, సోలి, బీ సంపత్ కుమార్, కే జోసఫ్ రాజు, ఎం పౌలు, ఎం చిట్టిబాబు, టీ నాని, కే రామయ్య, కే విజయ రాజు, వైసిపి నాయకులు మెండా చంద్రపాల్, కందుల నాగరాజు, నగుళ్ళ సత్యనారాయణ, తాళ్ళూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవికి నివాళి అర్పించిన పినమాల నాగ కుమార్



ఉయ్యూరు , ప్రజాపాలన ప్రతినిధి : ఆంధ్ర రాష్ట్ర సాధన కోరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి యైన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని దళిత ఐక్య వేదిక వ్యవస్థాపకులు పినమాల నాగ కుమార్ అన్నారు .స్వతంత్ర సమరయోధులు పొట్టి శ్రీరాములు 69వ వర్ధంతి సందర్భంగా దళిత ఐక్య వేదిక కార్యాలయంలో దళిత ఐక్య వేదిక వ్యవస్థాపకులు నివాళులు అర్పించారు. గాంధీ గారి అడుగుజాడలలో హరిజనోద్ధరణకు క్రుషి చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు .

## బాపుకు ఘన నివాళులు



నరసాపురం, డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రముఖ ని నీ ద ర్శ కుడు, చిత్రకారుడు బాపు జయంతి సందర్భంగా బుధవారం వశిష్ఠ గోదావరి తీరాన బాపు ఘాట్ వద్ద బాపు విగ్రహానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బండారు ప్రతాప్ నాయుడు, బండారు పటేల్ రాజానాయుడు, నాయకులు పూలమాలలు వేసి బాబుకు ఘన నివాళలర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాపు తెలుగుదనాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేశారని, అటువంటి గొప్ప దర్శకుడు మన ప్రాంతానికి చెందినవారు కావటం మన ప్రాంతం అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు చిటికెల రామ్మోహనరావు, రెడ్డప్ప ధవేజీ, దివి సత్యం, బళ్ల మూర్తి, శింగంశెట్టి తాతాజీ, ఆరేటి వేణు, రెడ్డిం శ్రీను, గన్నవరపు శ్రీను, మోసుగంటి శేఖర్, అడిదెల డానియల్, దేవ చింతయ్య, నడిపూడి శ్రీను(బుల్లెట్ శ్రీను), పాలూరి ప్రసాద్, పులపర్తి సతీష్, పులపర్తి శ్రీధర్, జొన్నల సతీష్, చల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పొత్తూరి జన్మదిన వేడుకలు



నరసాపురం, డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) : నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆయన నివాసంలో పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత గురువుల ఆశీర్వచనాల అనంతరం శాసనమండలి మాజీ చైర్మన్, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఏ షరీఫ్ ముఖ్యఅతిథిగా పాల్గొని రామరాజుచే కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై రామరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి మరియు లెప్రసి ఆసుపత్రిలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తదుపరి స్థానిక బొండమ్మ వృద్ధాశ్రమం నందు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 31 వ వార్డు కౌన్సిలర్ పాలూరి బాబ్జి, పార్టీ నాయకులు రాయుడు శ్రీరాములు, పొన్నాల నాగబాబు, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవీంద్రనాథ్, సంకు భాస్కర్ నాయుడు, అధికారి అనంత రామారావు, అధికారి కిరణ్, గుబ్బల నాగరాజు, వాతాడి ఉమా, కత్తిమండ ముత్యాలరావు, పాలా రాంబాబు, జోగి పండు, సంధి నరసింహారావు, ఎండి మౌలాలి, హుస్సేన్, సన్ రైజ్ రమేష్, అందేరామకృష్ణ, పెంద్ర శ్రీను, నరేష్, చల్లా పద్మావతి, కొలచన పద్మ, తిరుమాని శశిదేవి, పెమ్మాడి శ్రీదేవి, బోరా చిన్నాయమ్మ, ముస్కోడి రవి, పెయింటర్ శీను నియోజకవర్గ నాయకులు అందరూ పాల్గొన్నారు

## యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి




భీమవరం, డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలలోని ఇంజనీరింగ్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో మత్తుపానీయాల దుష్ఫలితాలపై కళారూపాల ద్వారా విద్యార్థులను,యువతను జాగృతులను చెయ్యాలనే లక్ష్యంతో మద్యవిమోచన ప్రచారకమిటీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహిస్తుందని ఏపీ మద్య విమోచన ప్రచారకమిటీ రాష్ట్ర చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక విష్ణు ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఆడిటోరియంలో జరిగిన సదస్సులో ప్రధానవక్తగా లక్ష్మణరెడ్డి పాల్గొని ప్రసంగించారు. చిన్న వయస్సులోనే మత్తు పానీయాలకు అలవాటు పడితే వ్యసనపరులుగా మారుతారని నేటి సమాజంలో ప్రధానసమస్య మత్తుపదార్థాలని వీటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు హితవు పలికారు. సమాజంలో ఉన్న వ్యసనపరులకు ఉచితంగా రాష్ట్రంలో 15 జిల్లాస్థాయి ప్రభుత్వ ఆసుపత్రులలో డ్రగ్ డి–అడిక్షన్ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం15 చోట్ల ఉచితంగా ఏర్పాటు చేసిందన్నారు.ఎవరైనా వ్యసనపరులుగా మారిఉంటే వారిని గుర్తించి డీ–అడిక్షన్ కేంద్రాలలో చేర్చేవిధంగా కృషి చేయాలని లక్ష్మణరెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అక్రమమద్యం, నాటుసారా, గంజాయి, డ్రగ్స్ ను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరోను ఏర్పాటుచేసిందని దీని ఫలితంగా గత రెండు సంవత్సరాలలో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈసదస్సుకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసులు అధ్యక్షత వహించగా కళాశాల ప్రిన్సిపల్ సూర్యనారాయణ, సెబ్ అసిస్టెంట్ సూపరిండెంట్ భార్గవ, ఏపీ బేవరెజెస్ కార్పొరేషన్ డిపో మేనేజర్ మూర్తిరాజు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ గంగరాజు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉక్కుమనిషి శ్రీ సర్దార్ వల్లభాయి పటేల్: మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య



నందిగామ డిసెంబర్15 ప్రజాపాలన ప్రతినిధి:జాతీయ ఐక్యతకు ఊపిరినిచ్చిన దీ శాలి, భారతరా జ్యాం గ రచనలోనూ ముఖ్యపాత్ర పోషించిన ఉక్కుమనిషి శ్రీ సర్దార్ వల్లభాయి పటేల్ అనిమాజీశాసన సభ్యు రాలు తంగిరాల సౌమ్య అన్నారు. పట్టణం రైతుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు బుధవారం ఉదయం భారత ఉక్కు మనిషి శ్రీ సర్దార్ వల్లభాయి పటేల్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూ లమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమ ములో తెదేపా నేతలు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు అర్పించిన వైకాపా నాయకులు



కావలి, డిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి :పట్టణంలోని వై కా పా కార్యాలయం లో బుధవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పొట్టి శ్రీరాములు 69 వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి వైకాపా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు అమర యాదగిరి గుప్తా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని తెలియజేశారు. భాషాప్రయుక్త రాష్ట్రాల కోసం కృషి చేసిన మహనీయుడు అని తెలిపారు. హరిజనోద్ధరణ కోసం నిరంతరం పాటుపడిన గొప్ప వ్యక్తి అని తెలియజేశారు. మండుటెండలో హరి జనోద్ధరణ కోసం మండుటెండలో చెప్పులు గొడుగు లేకుండా జాతీయ ఉద్యమాన్ని ప్రచారం చేసే వారిని చెప్పారు. బొంబాయిలో శానిటరీ ఇంజనీరింగ్ చదువు పూర్తి చేశారని చెప్పారు. ఆయన జీవితాన్ని జాతికి దేశానికి అంకితం చేయాలని నిశ్చయించుకున్నారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కనుమర్లపూడి నారాయణ ,తిరివీధి ప్రసాద్ , కుందుర్తి కామయ్య , పందిటి కామరాజు ,నాయబ్ రసూల్ ,రంగయ్య ,పరసు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు

## మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు



నరసాపురం, డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) :ఆంధ్రరాష్ట్ర సాధనకోసం అమరులైన పొట్టి శ్రీరాములు 69 వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యనిర్వహణాధికారి యస్.వి. సుబ్రహ్మణ్యం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రాన్ని అందించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని అన్నారు. తెలుగు రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా దేశంలోనే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి బీజంవేసిన మహోన్నత వ్యక్తిగా చరిత్రలో చిరకాలం గుర్తుంటారని గాంధేయమార్గంలో స్వతంత్ర సమరంలో పాల్గొన్న ప్రముఖుల్లో ఆయన ఒకరని అన్నారు. ఆశయసాధనకోసం ఆయన చూపించిన తెగువ, స్ఫూర్తి, విలువలు నేటియువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో డివిజనల్ పౌర సంబంధాల అధికారి యస్.వి. మోహనరావు, కె. ఆర్.సి. తశీల్దార్ ఆర్.వి. కృష్ణారావు, సీనియర్ అసిస్టెంట్లు పి.నాగ ప్రసాద్, జ్యోతి, దుర్గ, వరలక్ష్మి ,మూర్తి, చైతన్య, భార్గవ్, కోటేశ్వరరావు, డేవిడ్, సర్వే విభాగం రమణ, సిబ్బంది సత్యనారాయణ, నారాయణ, అంజిబాబు, బాలాజీ, సమాచారశాఖ సిబ్బంది చింజిలి శ్రీనివాసనెహ్రూ, రెడ్డి. వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై అవగాహన:పందిటి



కావలి డిశంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి :వెంగల్ రావు నగర్ 19 వ వార్డు మాజీ కౌన్సిలర్ పందింటి కామరాజు చేతుల మీదగ క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రత్యేక పారిశుద్ధ్య అవగాహన కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా క్లీన్ ఆంధ్రప్రదేశ్ గా ఉండాలనే ఉద్దేశంతోటి అదే విధముగా కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు 19 వార్డులో తడి చెత్త పొడి చెత్త ప్రమాదకరమైన చెత్తని వేరువేరుగా ఇవ్వాలనే ఉద్దేశంతోటి మూడు టబ్స్ ప్రతి ఇంటికి ఇవ్వడం జరిగిందన్నారు. జరుగుతుందన్నారు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి ప్రజలందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

PAY BACK TO SOCIETY SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 16, డిసెంబరు 2021


## ఉక్రెయిన్‌లో అమెరికా పన్నాగాలు

అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాద దేశాలు, నాటో కూటమి రష్యాతో కయ్యానికి కాలు దువ్వుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉక్రెయిన్‌లో జెలెన్స్కీ ఆధ్వర్యంలోని మితవాద ప్రభుత్వాన్ని రష్యాకు వ్యతిరేకంగా ఎగదోస్తూ అమెరికా, యూరప్ దేశాలు, వాటి అధీనంలోని ప్రచార బాకాలు అదే పనిగా అసత్య ప్రచారం సాగిస్తున్నాయి. రష్యాయేమో దురాక్రమణదారుగాను అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు ప్రపంచ శాంతి పరిరక్షకులుగాను అవి చూపిస్తున్నాయి. ఆర్థిక మాంద్యాన్ని, కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడంలో సామ్రాజ్యవాద దేశాలు ఎంత ఘోరంగా విఫలమైందీ యావత్ ప్రపంచం గమనించింది. ప్రపంచంలోకెల్లా అత్యధికంగా 11.53 కోట్ల కేసులు, 1.89 కోట్ల మరణాలతో జి-7 దేశాలు రికార్డుకెక్కాయి. కొత్తగా ముంచుకొస్తున్న ఒమిక్రాన్ విషయంలో ఇదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే యూరప్‌లో మరో 7 లక్షల మంది దాకా చనిపోయే ప్రమాదముందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) చేసిన హెచ్చరిక పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కోవిడ్ మహమ్మారి సృష్టించిన విలయంతో బాటు దశాబ్దాలుగా అమలు చేస్తూ వస్తున్న నయా ఉదారవాద విధానాలు సృష్టించిన ఆర్థిక ఉత్పాతం వీటిని ఇంకా వెన్నాడుతూనే ఉంది. అదే సమయంలో చైనా, రష్యా అన్ని రంగాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాయి. సామ్రాజ్యవాద దేశాల పెత్తనాన్ని ఇవి బాహాటంగానే సవాల్ చేయడం, బహుళ ధ్రువ ప్రపంచం దిశగా పరిణామాలు చోటు చేసుకుంటుండడం సంపన్న దేశాలను బెంబేలెత్తిస్తున్నాయి. చైనా, రష్యాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దేశాలు పావులు కదుపుతున్నాయి. మానవ హక్కులు, ప్రజాస్వామ్యం పేరుతో చైనాపై దాడి చేస్తున్న జి-7 దేశాలు, రష్యాపై దాడికి ఉక్రెయిన్‌ను సాకుగా చూపుతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేస్తే ఊరుకునేది లేదని ఈ కూటమి ప్రతినిధులు లివర్‌పూల్ నుంచి ఒక ప్రకటన జారీ చేశారు. ఉక్రెయిన్‌లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన విక్టర్ యనుకోవిచ్ ప్రభుత్వాన్ని 2014లో కుట్ర ద్వారా కూల్చివేసిన అమెరికా ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం హాస్యాస్పదం. యనుకోవిచ్ చేసిన నేరమేమిటి? ఇ.యు, ఐఎంఎఫ్ డిమాండ్ చేసిన పొదుపు చర్యలను అమలు చేసేందుకు నిర్ద్వంద్వంగా తిరస్కరించిన ఆయన, రష్యా సహాయాన్ని కోరారు. దీనిని సహించలేని అమెరికా ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫాసిస్టు శక్తులను ఎగదోసింది. ఆ తరువాత వచ్చిన మితవాద ప్రభుత్వం ఉక్రెయిన్ కమ్యూనిస్టు పార్టీతో సహా ప్రతిపక్ష రాజకీయ పార్టీలపైన నిషేధం విధించింది. ఉక్రెయిన్‌లో 40 శాతానికి పైగా ప్రజలు మాట్లాడే రష్యన్ భాషను నిషేధించడం, ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని రష్యన్ తెగలను క్రూరంగా అణచివేయడం వంటి ఫాసిస్టు చర్యలకు పాల్పడింది. రష్యన్ జనాభా ఎక్కువగా ఉన్న డాన్‌బాశ్చ్, లుగానెట్స్క్ ప్రాంతాల్లో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ నాజీలను తలపించింది. అటువంటి ఫాసిస్టు ప్రభుత్వానికి అమెరికా బాహాటంగా మద్దతిస్తున్నది. దానికి అండగా నాటో సేనలను ఈ ప్రాంతానికి తరలించింది. ప్రత్యర్థుల పన్నాగాలను గమనించిన రష్యా తన సరిహద్దుల్లో సైన్యాలను అప్రమత్తం చేస్తే దానిపై అమెరికా నానా యాగీ చేస్తున్నది. రష్యా తన సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరిస్తే దురాక్రమణకు అంటున్న అమెరికానే అతి పెద్ద దురాక్రమణదారు. అమెరికా ప్రపంచ వ్యాపితంగా 700కి పైగా సైనిక స్థావరాలను నెలకొల్పింది. అదీగాక నల్ల సముద్రం చుటూ ఉన్న పోలండ్, చెక్, హంగరీ, ఇతర ప్రాంతాల్లో సైన్యాన్ని, ఆయుధాలను అమెరికానే మోహరించింది. ఉక్రెయిన్ నుంచి ప్రయోగిస్తే ఆరు నిమిషాల్లో మాస్కోను చేరుకునేలా క్షిపణులను సిద్ధం చేసి ఉంచింది. సోవియట్ యూనియన్ పతనమైన సమయంలో కుదుర్చుకున్న ఒప్పందంలో నాటోను తూర్పు దిశగా ఒక్క అంగుళం కూడా విస్తరించబోమని అమెరికా హామీ ఇచ్చింది. ఇప్పుడు దానికి కూడా తూట్లు పొడిచి తూర్పు యూరప్ లోని లాత్వియా, లిథువేనియా, వంటి దేశాలను నాటోలో చేర్చుకుంది. బెలారస్ అందుకు తిరస్కరించడంతో ఆ దేశంపై ఆంక్షలు విధించింది. ఉక్రెయిన్‌ను తన గుప్పెట్లో పెట్టుకోవడం ద్వారా యూరోపియన్ దేశాలకు రష్యా గ్యాస్ పైపులైన్ ప్రాజెక్టును అడ్డుకోవడం అమెరికా పన్నాగంలో భాగం. తద్వారా అమెరికన్ ఇంధన కంపెనీలకు లాభం చేకూరేలా చూసుకుంటున్నది. మధ్య ప్రాచ్యంలో సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అమెరికా పన్నిన పన్నాగాన్ని ఇరాన్‌తో కలసి రష్యా సమర్థవంతంగా తిప్పికొట్టడం, వెనిజులా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్‌పై అమెరికా ఆంక్షలను చైనాతో కలసి రష్యా గట్టిగా వ్యతిరేకించడాన్ని అమెరికా సహించలేకపోతున్నది. గత శనివారం బైడెన్ పుతిన్‌తో జరిపిన ఫోన్ సంభాషణల తరువాత ఉద్రిక్తతలు మరింత పెరిగాయే తప్ప తగ్గలేదు. మధ్య ప్రాచ్యంలో ఇంధన వనరులపై ఆధిపత్యం నిలబెట్టుకోవడం కోసం అమెరికా ఎంతకైనా తెగిస్తుంది. అయితే, అమెరికాతో ఢ అంటే ఢ అనడానికి రష్యా, చైనా సిద్ధంగా ఉన్నాయి. ఈ పరిస్థితిలో ప్రధాన అణు సంపన్న దేశాల మధ్య ఉద్రిక్తతలు యుద్ధానికి దారి తీస్తే ప్రపంచ శాంతి, సుస్థిరత తీవ్ర ప్రమాదంలో పడతాయి. సమస్యను అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం అమెరికాకు తగని పని.

# ప్రశ్నించటమూ మన సంస్కృతే!




దేశ రాజధానిలో చలి దట్టంగా అలముకుంటున్న వేళ ప్రతిపక్షాల్లోను, ఉద్యమాల్లోనూ వేడి తగ్గినట్లు కనిపిస్తోంది. పార్లమెంట్ సమావేశాలు నిస్సారంగా, యాంత్రికంగా సాగుతున్నాయి. ఎటువంటి కార్యాచరణకు పూనుకోవాలో తెలుసుకోలేని అయోమయంలో ప్రతిపక్షాలు ఉన్నాయి. గత సమావేశాల్లో గందరగోళం సృష్టించి ఈ సమావేశాల్లో సస్పెండైన 12మంది విపక్షసభ్యులు రెండు వారాలుగా ప్రతి రోజూ గాంధీ విగ్రహం ముందు నిరసన ప్రదర్శన జరుపుతున్నా పెద్దగా పట్టించుకునేవారు లేరు. ఈ అంశంపై రాజ్యసభ అప్పుడప్పుడూ వాయిదాపడుతున్నా ఉభయసభల్లో బిల్లులు యథాప్రకారం ఆమోదం పొందడం ప్రతిపక్షాల మధ్య చీలికను సూచిస్తోంది. రాజ్యసభలో మంగళవారం కొంతమంది సభ్యులు వెల్‌లోకి వచ్చి సభ్యుల సస్పెన్షన్ రద్దు చేయాలని నినాదాలు చేస్తుంటే తృణమూల్ కాంగ్రెస్ నేత సుఖేందురాయ్ సభా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఉభయ సభల మీడియా గ్యాలరీలు ఖాళీగా వెలవెలబోతున్నాయి. ప్రధాని కనుసన్నల్లో ప్రారంభమైన సంసద్ టీవీని పెద్దగా చూసేవారు లేరు. మరోవైపు ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాదికిపైగా నిరసన ప్రదర్శనలు జరిపిన రైతులు శిబిరాలు తొలగించి ఇళ్లకు వెళ్లిపోవడంతో పోలీసులు కూడా బారికేడ్లను తొలగించి వాహనాల రాకపోకలకు వీలు కల్పించారు. 'గ్రామాలకు గ్రామాలే తొలగించినట్లు కనపడుతున్నాయి..' అని స్థానికుడొకరు వ్యాఖ్యానించారు. ఉన్నట్లుండి పరిస్థితి ఇలా దాదాపు సద్దుమణగడాన్ని తుఫాను ముందు ప్రశాంతతగా అభివర్ణించవచ్చా? చెప్పలేము. ప్రధానమంత్రి మోదీ తానే స్వయంగా ప్రజల ముందుకు వచ్చి సాగుచట్టాలను ఉపసంహరించుకుని, ప్రభుత్వం రైతుల డిమాండ్లను అంగీకరించిన తర్వాతనే రైతులు శాంతించారు. ఈ ఉపసంహరణ విషయం మాత్రమే కాదు, మరే విషయంలోనైనా పార్లమెంట్‌కు ప్రధానమంత్రి వివరించేది ఏమీ లేదని, తామెంత గగ్గోలుపెట్టినా అరణ్యరోదనే అవుతుందని, తమ ప్రశ్నలకు పార్లమెంట్‌లో జవాబులు రావని ప్రతిపక్షాలకు రానురానూ అర్థమవుతోంది. పార్లమెంట్ సాగుతుండగానే మోదీ తన మానాన తాను ఉత్తర ప్రదేశ్‌లో పర్యటనలు జరుపుతూ ప్రజల మనోభావాలను బిజెపి వైపు తిప్పేందుకు ఉధృత ప్రయత్నాలు చేస్తున్నారు. ఎందుకంటే ఆయనకు పార్లమెంట్‌తో పెద్దగా పనిలేదు. పార్లమెంట్‌కు క్రమం తప్పకుండా హాజరు కావాలని, లేకపోతే మళ్లీ సీట్లు ఇవ్వడం కష్టమని తమ పార్టీ ఎంపీలను గత వారం హెచ్చరించిన మోదీ తాను మాత్రం పార్లమెంట్‌కు హాజరు కావడం తన విధ్యుక్త ధర్మంగా భావించడం లేదు. రెండురోజుల క్రితమే సరయూ నహర్ ప్రాజెక్టును ప్రారంభించిన మోదీ సోమవారం తన నియోజకవర్గంలో కాశీ విశ్వనాథ్ కారిడార్‌ను ప్రారంభించి కాశీ వీథుల్లో జనం దృష్టిని ఆకర్షించే అనేక పనులు చేశారు. దేశ రాజకీయాల్లో ప్రజల భావోద్వేగాల్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించే నేతల్లో తనను మించిన వారు లేరని మోదీ మరోసారి నిరూపించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా వందలాది ఆర్ఎస్ఎస్ ప్రముఖుల్ని ఆహ్వానించడం, వారితో వారణాసిలో హోటళ్లు, అతిథిగృహాలు కిక్కిరిసిపోవడం, మంత్రులందర్నీ జ్యోతిర్లింగాల పూజకు పంపడం మోదీ ఎవరి మద్దతుపై బలంగా ఆధారపడ్డారో అర్థమవుతుంది. మోదీ భారతదేశ పూర్వవైభవాన్ని పునరుజ్జీవింపచేస్తున్నారని, సనాతన భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారని కాశీ, అయోధ్య, సోమనాథ్ తదితర ఐతిహాసిక స్థలాలను పునరుద్ధరించారని ఆనందపరవశులవుతున్నవారు ఇదే భారతీయ సంప్రదాయంలో భాగమైన ప్రశ్నించే సంస్కృతిని విస్మరిస్తున్నారు. మన ఉపనిషత్తుల్లోనే ప్రశ్నించే తత్వం ఉన్నది. ప్రశ్న- జవాబుల ఆధారంగానే ఉపనిషత్తులను రచించారు. గార్గి, మైత్రేయ లాంటి స్త్రీలు కూడా ఈ ప్రశ్నల పరంపరలో పాల్గొన్నారు. అసలు మనకు ప్రశ్నోపనిషత్తు పేరుతోనే ఒక ఉపనిషత్తు ఉన్నది. దేవుడి ఉనికిని కూడా ప్రశ్నించినవారున్నారు. ప్రశ్న, అన్వేషణల ద్వారానే మనం శాస్త్రీయదృక్పథాన్ని, గణితాన్ని, ఖగోళిక శాస్త్రాల్ని ప్రపంచానికి చాటి చెప్పాము. ఈ మహత్తర విషయాలను మనం మరిచిపోయాం. సాగుచట్టాల్ని ఎందుకు తెచ్చారు, ఎందుకు ఉపసంహరించుకున్నారు, నిత్యావసర వస్తువుల ధరలు ఎందుకు పెరుగుతున్నాయి అన్న ప్రశ్నలకు పార్లమెంట్‌లోనే సమాధానం లభించనప్పుడు బయట లభిస్తాయనుకోవడం అమాయకత్వం. ఆక్సిజన్ అందక మరణించిన వారి లెక్కలు కానీ, నిరసన ప్రదర్శనల్లో మరణించిన రైతుల వివరాలు కానీ ప్రభుత్వం వద్ద ఉండవు. అసలు అలాంటి మరణాల సమాచారమే తమ వద్ద లేవనే సమాధానం వస్తుంది. రిలయన్స్, స్పెన్సర్, బిగ్‌బజార్ ఇత్యాది పెద్ద వ్యాపారసంస్థలు అత్యధికంగా పంట ఉత్పత్తులను సేకరించడం ద్వారా మార్కెట్‌లో కృత్రిమ కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయని ఆహార, ప్రజాపంపిణీ శాఖకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే, ఏ నిత్యావసర ఆహార వస్తువుల నిల్వలపై పరిమితులు లేవని, కావాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవచ్చని సమాధానం లభించింది. 2010-11 నుంచి 2018-19 వరకు పెట్రోలియం ఉత్పత్తులపై కేంద్ర ఎక్సైజ్ సుంకం రూ.76,547కోట్ల నుంచి రూ.2,29,247కోట్లకు, కస్టమ్స్ సుంకం రూ.26,282కోట్ల నుంచి రూ.39,123కోట్లకు పెరిగిందని, ఇతర దేశాల్లో ఈ విషయంలో అనుసరిస్తున్న పద్ధతులకు అనుగుణంగా మన దేశంలో ధరలను సమీక్షించుకోవాలని ఈ స్థాయీసంఘం సూచిస్తే ఆ మొత్తాన్ని మౌలిక సదుపాయాలకు, ఇతర అభివృద్ధి పనులకు ఖర్చు పెడుతున్నామని కేంద్రం స్పష్టంగా సమాధానం చెప్పింది. అంతేకాక వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చుకోవడం కోసమే 2021-22లో వ్యవసాయ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సెస్‌ను మోపామని ప్రభుత్వం ఖండితంగా సమాధానం చెప్పింది. సమర్థమైన ఆర్థిక నిర్వహణ ద్వారా వనరులను సమకూర్చాల్సిన ప్రభుత్వం ప్రజలపై భారం మోపి మౌలిక సదుపాయాలకు ఖర్చుపెడుతున్నామని చెప్పుకోవడం విడ్డూరం. ఇదే ప్రభుత్వం ఈ ఏడాది మార్చి అంతానికి రూ.2,02,781 లక్షల కోట్ల మేరకు వ్యాపారవేత్తల మొండిబాకీలను రద్దు చేశామని, గత ఏడేళ్లలో రూ.10.72 లక్షలకోట్లకు పైగా బకాయిలను రద్దు చేశామని రిజర్వు బ్యాంకు సమాచార హక్కు క్రింద వేసిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పింది. రద్దు చేసిన బకాయిల్లో 75శాతం ప్రభుత్వరంగ బ్యాంకులకు చెందినవే. సాధారణంగా ఎంతో ప్రయత్నించి, సాధ్యమైనంత మేరకు వసూలు చేసుకున్న తర్వాత బ్యాంకులు మొండి బాకీల రద్దు విషయం ఆలోచిస్తాయి. కాని మోదీ హయాంలో రుణాల రద్దు విషయంలో పారదర్శకత లేదని ఆరోపణలు వస్తున్నాయి. పెద్ద పెద్ద సంస్థల రుణాలు అవలీలగా రద్దు అవుతుంటే, చిన్నసంస్థల పట్ల బ్యాంకులు ఎలాంటి జాలి చూపించడం లేదు. కార్పొరేట్ సంస్థల నుంచి ముక్కుపిండి బకాయిలు వసూలు చేసే బదులు ప్రజలపై భారీ పన్నుల భారం ఎందుకు మోపుతున్నారని, అవే సంస్థలకు ప్రభుత్వ ఆస్తులను ఎందుకు అమ్మ జూపుతున్నారని అడిగే ప్రశ్నలకు సమాధానం లభించదు. మోదీ కొద్ది రోజుల క్రితం ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ బ్యాంకులు మునిగిపోతే గతంలో రూ. లక్ష వరకే ప్రభుత్వం హామీ ఇచ్చేదని, ఈ మొత్తాన్ని తాము రూ.5లక్షలవరకు పెంచామని ప్రకటించారు. కాని బ్యాంకుల్లో అధికంగా డబ్బు జమ చేసుకున్నవారి గతేమిటి? అసలు గతంలో రూ.లక్ష వరకు గ్యారంటీ ఇచ్చినప్పటికీ బ్యాంకులు మునిగిన దాఖలాలు లేవు. 1969లో బ్యాంకుల జాతీయాకరణ తర్వాత ఒక్క బ్యాంకు కూడా దివాలా తీయలేదు. దేశమంతటా ప్రైవేట్, విదేశీ బ్యాంకులు తెరిచిన తర్వాత కూడా 87శాతం మంది ప్రజలు ప్రభుత్వ బ్యాంకుల్లో డబ్బులు జమ చేసుకున్నారు. ఆర్థిక మాంద్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక బ్యాంకులు మూసివేతకు గురైనా, భారతీయ బ్యాంకులు దెబ్బతినలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అయిదు బ్యాంకులు, అనేక ఆర్థిక సంస్థలు దెబ్బతిన్నాయి. లక్ష్మీ విలాస్ బ్యాంకు, పంజాబ్ అండ్ మహారాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంకు, యస్ బ్యాంకు తదితర బ్యాంకులనుంచి డిపాజిటర్లు తమ డబ్బు తాము విత్ డ్రా చేసుకునేందుకు నానా యాతనలు పడుతున్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత అవలంబించిన తప్పుడు ఆర్థిక విధానాలద్వారా బ్యాంకులు నష్టాల బారినపడితే వాటిని విలీనం చేయడమో లేక మొండి బాకీలు రద్దు చేసి వాటి బ్యాలన్స్ షీట్లు మెరుగ్గా ఉన్నాయని చూపించుకోవడమో చేస్తున్నారు. బ్యాంకులు మునిగిపోతే రూ.5 లక్షలవరకు గ్యారంటీ ఇస్తామని చెప్పే బదులు మోదీ అసలు బ్యాంకులే మునిగిపోవని ఎందుకు గ్యారంటీ ఇవ్వలేరు? బ్యాంకులపై పర్యవేక్షణ జరపాల్సిన బాధ్యత రిజర్వు బ్యాంకుది. దేశంలో అత్యధిక మొత్తం ఆర్జించే సంస్థ అయిన రిజర్వు బ్యాంకు రిజర్వులనుంచే కేంద్రం గత కొద్ది సంవత్సరాలుగా తమ పబ్బం గడుపుకుంటున్న మాట నిజం కాదా? 2020-21లోనే రిజర్వు బ్యాంకు రూ. 99,122 కోట్ల మిగులును భారత ప్రభుత్వానికి బదిలీ చేసిందని, ఆర్థిక మంత్రి స్వయంగా సోమవారం లోక్‌సభకు వెల్లడించారు. కేంద్రానికే భారీ మిగులును బదిలీ చేసే రిజర్వు బ్యాంకు సంస్థ ఉండగా బ్యాంకులు ఎందుకు దివాలా తీయాలి? దేశంలో సామాన్య ప్రజలు బ్యాంకుల్లోడబ్బు జమ చేసుకుంటే బడా సంస్థలు బ్యాంకులనుంచి వేలకోట్లు రుణాలు తీసుకుని ఎగ్గొడుతున్నాయి. ప్రభుత్వం ఎవరి పక్షం వహించాలి? ఆలయాలు పునరుద్ధరిస్తే ప్రజలు భక్తిపారవశ్యంలో పడి ప్రశ్నించే స్వభావం ఎల్లవేళలా కోల్పోతారనుకోవడం అమాయకత్వమే!

# రైతు వికాసానికి వినూత్న ఆలోచన

రైతును దేశానికి వెన్నుముక అంటున్నాం. జై కిసాన్ అనేది తరచుగా వినిపించే నినాదం. నిజానికి రైతు పరిస్థితి దయనీయంగా ఉంది. ఇందుకు కారణాలు అనేకం. నీటి వనరులను (బోర్లు) పొందేందుకు భారీగా డబ్బు ఖర్చు చేయాల్సి రావడంబీ మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, పంట దిగుబడి పూర్తిగా పర్యావరణ పరిస్థితుల మీద ఆధారపడడం (వర్షం లేకపోవడం, అధిక వర్షం, కీటకాల దాడి, పురుగుమందుల అసమర్థత), ఒక ప్రాంతంలోని రైతులందరూ ఒకే రకమైన పంటను పండించడం వల్ల ధరల్లో అసమతుల్యత మొదలైన కారణాల వల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యల కారణంగా నేడు చాలామంది రైతులు వ్యవసాయం చేసేందుకు సుముఖంగా లేరు. చేసేవారు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో సాగు చేస్తున్నారు. దీనికి ప్రాథమిక కారణం అభద్రతతో కూడుకొన్న రైతు జీవితం. రైతు పంటపై కొంత డబ్బు పెట్టుబడి పెట్టినప్పుడు (స్వంతం కావచ్చు లేదా అప్పుగా తీసుకున్న డబ్బు కావచ్చు) మంచి దిగుబడి రాని పరిస్థితుల్లో పిల్లల చదువులు, వివాహాలు మొదలైన ముఖ్యమైన కుటుంబ ఖర్చులు కూడా భరించలేని దుస్థితికి వెళ్తున్నాడు. ఈ నిస్సహాయత చాలామంది రైతులను ఆత్మహత్యలవైపు నడిపిస్తోంది. అంతేగాక, హైదరాబాద్ వంటి నగరాల్లో ఏటీఎంల దగ్గర ఇతర ప్రదేశాలలో నైట్ వాచ్‌మన్‌గా అతి తక్కువ జీతాలకు పనిచేసే వ్యక్తులు ఎక్కువగా రైతు బంధుత్వానికి చెందిన వారే మనకు తారసపడుతున్నారు!ఇప్పటికే ప్లాస్టిక్ బియ్యం మార్కెట్లోకి రావడం మొదలైంది అనే పుకార్లు వెల్లువెత్తుతున్నాయి. నిజం కాకపోవచ్చు కానీ కచ్చితంగా రైతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నందున మన పిల్లలు ఏదో ఒక రోజు ఈ పరిస్థితిని వాస్తవంగా ఎదుర్కోవలసి ఉంటుంది. అలా జరగకుండా ఉండాలంటే రైతు వర్గాన్ని పరిరక్షించడంపై తీవ్రంగా ఆలోచించాలి. కొన్ని వినూత్న పద్ధతులను అవలంబించడం ద్వారా సాగు పట్ల రైతుల్లో ఉత్సాహం స్థాయిని పెంచవచ్చు. అందుకు, రైతుల స్వచ్ఛంద భాగస్వామ్యంతో అమలు జరిగే ఈ కింది విధానాన్ని ప్రభుత్వమూ, రైతులు పరిశీలించవచ్చును. వివిధ వాతావరణ పరిస్థితుల ఆధారంగా ప్రభుత్వం ఏ పంటవేయాలన్నది సూచిస్తుంది. రైతు సొంత/ కౌలుకు తీసుకున్న భూమిలో పంటను సాగు చేయవలసి ఉంటుంది. దీనికి కావలిసిన నాణ్యమైన విత్తనాలు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుంది. ప్రభుత్వం ద్వారానే తగినంత సాగు నీరు అందుతుంది (బోరు బావి/ ఇతర నీటి వనరుల లభ్యత లేని పక్షంలో). ప్రభుత్వం నిర్దేశించే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం రైతు సాగు చేయాలి. పని సమయాలు కూడా ఇది ప్రస్తావిస్తుంది. నిర్దేశించిన పద్ధతిలో రైతు సాగు చేస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించేందుకు ప్రభుత్వం సూపర్వైజర్లను నియమిస్తుంది. అనారోగ్యం వంటి కొన్ని ఆవశ్యకాలపై గైర్హాజరు అనుమతిస్తారు. ఆ సమయంలో రైతు ప్రత్యామ్నాయ మానవశక్తిని అందించాలి. పంట దిగుబడి వచ్చిన తర్వాత ఉత్పత్తులను సేకరించి గోడౌన్లు, మార్కెట్లకు రవాణా చేయడానికి ప్రభుత్వం వనరులను (ఉచితంగా) అందిస్తుంది. మొత్తం సేకరణ, అమ్మకాల బాధ్యత ప్రభుత్వం స్వీకరిస్తుంది. పైన పేర్కొన్న షరతులకు లోబడి సాగు చేసిన రైతుకి పంట దిగుబడి ఎలా వచ్చినప్పటికీ కనీస నెలసరి వేతనం (ఎంత మొత్తం అనేది ద్రవ్యోల్బణం, ఇతర మనుగడ కారకాల ప్రకారం నిపుణుల కమిటీ నిర్దేశిస్తుంది) చెల్లించబడుతుంది. ఈ కనీస వేతనం అసలు ఏమీ రాని/ పేలవమైన దిగుబడి విషయంలో కూడా ఇస్తారు. అధిక దిగుబడి విషయంలో, రైతుకు అదనపు మొత్తం ఇస్తారు. (నిపుణుల కమిటీతో నిర్ణయం). ఉత్పత్తి మార్కెట్‌కు చేరుకున్న తర్వాత, ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం వినియోగదారులకు విక్రయిస్తారు. వచ్చిన ఆదాయం ప్రభుత్వానికి చెందుతుంది. ఇలా చేయడం వల్ల మధ్యవర్తి వ్యవస్థ కుప్పకూలి రైతుతోపాటు వినియోగదారుడూ లాభపడతారు.

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు నివాళి

చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)యడ్లపాడు మండలం మైదవోలు గ్రామంలోని బి సి కాలనీలో ఉన్న ప్రాధమిక పాఠశాలలో బుధవారం జనవిజ్ఞాన వేదిక చిలకలూరిపేట డివిజన్ ఆధ్వర్యంలో




అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.హేమలత మాట్లాడుతూ పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు గుణ సంపన్నులు కావాలన్నారు. ఇందులో భాగంగా వేయి రూపాయల విలువైన జనవిజ్ఞానవేదిక ప్రచురణ పుస్తకాలను పాఠశాల గ్రంధాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు శివ శంకర, ఉపాధ్యాయినులు జి.హేమలత, మహేశ్వరి, ఉపాధ్యాయులు ప్రకాష్, జెవివి డివిజన్ అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మంచి నైపుణ్యం ప్రదర్శించి ఆర్టికల్స్ ను తయారు చేసిన స్పందన బాలలు



గన్నవరం, ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 15:గన్నవరం మండలం దావాజీగూడెం లో ఉన్న స్పందన మానసిక వికాస కేంద్రం బాలలు మంచి ఆర్టికల్స్ తయారు చేసి మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించారని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సెక్రెటరీ సంకాబత్తుల రజిత వెంకట్ అన్నారు.ఈ సందర్భంగా బుధవారం నాడు రజిత వెంకట్ మాట్లాడుతూ దివ్యాంగులను అనే చిన్నచూపు చూడకుండా వారిని ప్రోత్సాహించినట్లుయితే అద్భుతాలు సృష్టిస్తారని ఆమె అన్నారు.స్పందన లో దివ్యాంగులచే ప్రత్యేకంగా బొకేస్,గాజులు,వాల్ హ్యాంగిస్స్ మరియు ఆర్టికల్స్ ఉన్నాయని,వారికి ప్రోత్సాహం అందించినట్లు అయితే మరిన్ని తయారు చేయడానికి అవకాశం ఉంటుందని,కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చి దివ్యాంగుల కాళ్లపై వారు నిలబడే విధంగా అవకాశాలు కల్పించాలని ఆమె అభ్యర్ధన చేసారు.స్పందన బాలలచే తయారు చేసిన ఆర్టికల్స్ కు మార్కెటింగ్ ఉంటే మరిన్ని వస్తువులను చెయ్యడానికి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ముందుకు వస్తుందని రజిత వెంకట్ అన్నారు.

## ఏపీ సీఎం కప్ టోర్నమెంట్ లో బాపులపాడు జట్టు విజయకేతనం

గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 15:గన్నవరం మండలం దావాజీగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల లో జరిగిన ఏపీ సీఎం కప్ టోర్నమెంట్ లో బాపులపాడు జట్టు విజయంకేతనం



ఎగురవేశారు. బాపులపాడు మండలం మహిళల కబడ్డీ, ఖోఖో జట్లు విజయవాడ రూరల్ మండలం జట్లు పై విజయం సాధించారు. క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చిన పీడీ అశోక్, పి ఈ టీ లు క్రాంతి , భాగ్యరాజు లకు, క్రీడాకారులకు బాపులపాడు మండల ఎంపిడివో ప్రసాద్ అభినందనలు తెలిపారు. ఈ పోటిలను గన్నవరం ఎమ్మెల్యే డా వల్లభనేని వంశీ మోహన్ఉదయం ప్రారంభించారు. పోటిల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ క్రీడలు నిర్వహణకు ఇంచార్జి పి డి శ్రీహర్ష,పి డి చందు,ధనియాల నాగరాజు ఉన్నారు.

## గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)తెలుగు రాష్ట్రం ఏర్పడటానికి ప్రాణం త్యాగం చేసిన తెలుగు తల్లి ముద్దుబిడ్డ పొట్టి శ్రీరాములు అని ప్రముఖ సాహితీ వేత్త నాటిక రచయిత, రంగస్థల నటులు విడదల సాంబశివరావు అన్నారు.. బుదవారం ఉదయం స్థానిక శాఖా గ్రంధాలయంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. తొలుత అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు కావూరు రమాదేవి, ప్రముఖ దంత వైద్యులు డా.పేర్ని కృష్ణ మోహన, శీలం నాగేశ్వరావు, దార్ల బుజ్జిబాబు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్



డిజిపి కార్యాలయం, ప్రజాపాలన ప్రతినిధి : అమరజీవి పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు గారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ గౌతం సవాంగ్ %ఖూా% మరియు పలువురు పోలీసు ఉన్నతాధికారులు.

## అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన బిజెపి నాయకులు

కావలి, డిసెంబర్ 15, ప్రజాపాలన ప్రతినిధి: శ్రీ పొట్టి శ్రీరాములు 69వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పొట్టి శ్రీరాముల విగ్రహానికి భాజాపా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు కందుకూరి సత్య నారాయణ మాట్లాడుతూ,పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం కృషి చేశారని హరిజనోద్ధరణకు పూనుకోవాలని రాసిన అట్టలను మెడకు తగిలించుకుని ప్రచారం



చేశారని అన్నారు. పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారని ఆయన జీవితం మన అందరం ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ప్రాణత్యాగం ఫలితమే దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలకు నాంది పలికిందని తెలిపారు. జువ్వలదిన్నే లో 100 అడుగులా విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు కేసరి బాల మురళి, పట్టణ ప్రధాన కార్యదర్శి వాయుగండ్ల సుదీర్ ,మాజీ అసెంబ్లీ కన్వీనర్ సివిసి సత్యం,బీజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుట్టు బోయిన మాధవరావు, పట్టణ కార్యదర్శి మంద కిరణ్ కుమార్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి అక్కిలగుంట జీవ, సవీంద్ర ,కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు తిరుపతి స్వామి, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షులు కామినేని ఉదయలక్ష్మి,కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి ముంగమూరు వెంకట్ రెడ్డి,బిజెపి పట్టణ నాయకులు రాజా గోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుల వ్యవస్థ మీద అలుపెరుగని పోరాటం చేసిన గొప్పవ్యక్తి అంబేద్కర్:ఉదయభాను,అరుణ్ కుమార్



నందిగామజగ్గయ్యపేట డిసెంబర్ 15 ప్రజాపాలనప్రతినిధి:జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధి నందిగామ మండలం రామిరెడ్డి పల్లి గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబెద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంజరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిదులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్,జగ్గయ్యపేట నియోజకవర్గ శా సన సభ్యులు శ్రీ సామినేని ఉదయభాను ,ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ,ఎమ్మెల్యే మేరుగ నాగార్జున హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారుఈసం



దర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమా ర్ మాట్లాడుతూ సువిశాల భారతవనికి దిశనిర్దేశం చేసే అద్భుతమైన రాజ్యాంగ నిర్మాణాని అందించిన డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ సేవలను దేశ ప్రజలందరూ గుర్తుంచుకోవాలని, దేశంలో అసమానతలు తొలగించి నవనిర్మాణ స్ఫూర్తి కి ప్రాణం పోసిన అరాధ్యుడు ఆయన అని,చిన్న తనంలో వారు అనుభవించిన కు ల వ్యవస్థ మీద అలుపెరుగని పోరాటం చేసి నిమ్నా జాతుల అభ్యున్నతికి, బడుగు బలహీన వర్గాల ఆర్థిక వృద్ధి కి పాటుపడిన కృషి వలుడు అని,స్వాతంత్ర్య భారతవనికి మొదటి న్యాయ శాఖ మంత్రి గా,భా ర తదేశ చరిత్రలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవలు ప్రశంసనీయంని అన్నారు.ఈకార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు, అభిమాను లు ,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ జి ఎస్ కళాశాలను ఎయిడెడ్‌గానే కొనసాగించాలి: విద్యార్థులు



జగ్గయ్యపేట డిసెంబర్15 ప్రజాపాలన ప్రతినిధి:జగ్గ య్యపేట పట్టణంలోని,స్థానిక గేంటెల శకుంతలమ్మ (ఎస్ జి ఎస్) కళాశాలను ప్రభుత్వ ఎయిడెడ్ కళాశా లగానే కొనసాగించాలని విద్యార్థులు చేస్తున్న నిరసన ప్రాంగణాన్ని జిల్లా సబ్ కలెక్టర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ తో కలిసి సంధర్శించి విద్యార్థులతో ఆంధ్రప్ర దే శ్ రాష్ట్ర ప్రభుత్వ విప్,జగ్గ య్యపేట నియోజకవర్గ శా సనసభ్యులు సామినేనిఉదయభాను ముఖాముఖి నిర్వహించారుఈసందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ విద్యార్థులు పట్ల,వారి భవిష్యత్ పట్ల పూర్తి భాద్యతగా వైఎస్సార్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఆనవస రంగా అపోహలు నమ్మవద్దని, రాష్ట్రంలో ఇప్పటి వర కు విద్యార్థులు కోసం అమ్మ ఒడి నుంచి కాలేజీల మె స్ చార్జీలు, ఫీజు రియంబర్స్ మెంట్ వంటి అనేక కార్యక్రమాలు గత పాలకులు కంటే మెరుగ ఈప్రభుత్వం అందిస్తుంది అని, ఎటువంటి రాజకీయ ఒత్తిడి లే కుండా ప్రతి పథకం నేరుగా మీ తల్లి దండ్రులు ఎకౌంటులో పడుతున్నాయి అని, యాజమాన్యం చేతికి కాకుండా మీ తల్లిదండ్రులు ఎకౌంటు లో డబ్బులు ఎందుకు వే స్తున్నామో మీరు ఆలోచన చేసారా? యాజమాన్యం ఏదైనా ఇబ్బందులు పెట్టిన మీ తల్లిదండ్రులు మీ భవి ష్యత్తు కోసం ఏ నిర్ణయం అయిన తీసుకునే వెలుసు పాటు కల్పించాలని ప్రభుత్వం ఉద్దేశ్యంని కానీ గత పాలకులు ఎవ్వరూ కూడా ఇటువంటి సుధీర్ఘ ఆలో చన చేయలేదు అని కానీ మీరు అర్థం చేసుకోకుండా ప్రభుత్వం నిర్ణయం తప్పు అంటున్నారు అని, ఆసలు ఫీజు ప్రభుత్వం చెల్లిస్తే కాలేజీలు ఎలా నడిస్తే ఇబ్బంది ఏముంది అని, ఒక్క సారి మీరు కూడా పునరాలో చించాలి అని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

## చీరాలఅభివృద్ధికి ప్రత్యేక దృష్టిపెట్టి, బాపట్ల జిల్లాకు,ఆంధ్రరత్న దుగ్గిరాల పేరుపెట్టాలని విజ్ఞప్తి

**అర్జీ అందజేసిన చీరాల జిల్లాసాధన జేఏసీకన్వీనర్ డాక్టర్ తాడివలస దేవరాజు**

చీరాల(ఒంగోలు) : నూతనంగా ఏర్పడనున్న బాపట్ల జిల్లాకు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరుపెట్టాలని, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతిని, చీరాల జిల్లాసాధన జేఏసీ కన్వీనర్, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస.దేవరాజు కోరారు.



పేరాల ఆంధ్రరత్న మున్సిపల్హైస్కూల్‌లో,ఆంధ్రరత్న దుగ్గిరాలగోపాలకృష్ణయ్య విగ్రహావిష్కరణకు, విచ్చేసిన డిప్యూటీస్పీకర్రఘుపతి కి,డాక్టర్ తాడివలస. దేవరాజు అర్జీఅందజేశారు. చీరాల–పేరాల ఉద్యమాన్నినడిపి, మహాత్మాగాంధీ ప్రశంసలు సైతం పొందిన, ఆంధ్రరత్న దుగ్గిరాలగోపాల కృష్ణయ్య పేరుపెట్టడం ద్వారా,ఆయనను గౌరవించినట్లు అవుతుందని పేర్కొన్నారు. చీరాల,బాపట్ల ప్రాంతాలు అభివృద్ధి చెందడానికి, పరోక్షంగా ఆంధ్రరత్న దుగ్గిరాల కీలకపాత్ర పోషించారని,అర్జీలో వివరించారు.



చీరాల జిల్లాసాధనకు, జెఎసికన్వీనర్‌గా చేసిన కృషిని తెలియజేస్తూ, నూతనంగా ఏర్పడనున్న బాపట్లజిల్లాకు, ఆంధ్రరత్నదుగ్గిరాల పేరుపెట్టాలని,విజ్ఞప్తి చేశారు. జీడిపప్పుదండతో, రాష్ట్ర డిప్యూటీస్పీకర్ కోన రఘుపతిని, ఘనంగా సత్కరించి,అలాగే చీరాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిపెట్టాలని విన్నవించారు.ముఖ్య,గౌరవ అతిథులుగా హాజరైన చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, వైఎస్సార్ సీపీ యువనేత కరణం వెంకటేష్,తదితర ప్రముఖులతో కలిసి,అనంతరం బాపట్లజిల్లాకు దుగ్గిరాల పేరుపెట్టాలని కోరుతూ,అర్జీ అందజేశారు. అర్జీ స్వీకరించిన, డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## సర్దార్ వల్లభాయ్ పటేల్,పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన వైసిపి నాయకులు

చిలకలూరిపేట :(ప్రజాపాలన ప్రతినిధి)పట్టణంలోని వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ మరియు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని,వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు,పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి,బిట్రా రాజేంద్ర,కో ఆప్షన్ సభ్యులు పొలిశెట్టి మస్తాన్,కొమరవల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు, నాయకులు తులబంధుల మణిదీప్, దాచేపల్లి నాగేశ్వరరావు,పొట్టి రత్నబాబు,చిలకల చంద్రశేఖర్, కొలిశెట్టి సుబ్రహ్మణ్యం,తవ్వ సుధాకర్, వై.యస్.ఆర్ నాయుడు,ఇక్కుర్తి పవన్ మరియు పలువురు పాల్గొన్నారు.

## విద్యతోనే కుటుంబ అభివృద్ధి

భీమవరం డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) : చదువుతోనే కుటుంబం తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణానికి చెందిన వాసా నరేంద్రకుమార్ జేఈఈ మెయిన్స్ లో లక్నో లో సీటు



సధించిన సందర్భంగా బుధవారం ఆవిద్యార్థిని స్థానిక క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోటీ నెలకొని ఉన్న జేఈఈ మెయిన్స్ సీట్లకు 98.5 శాతం మార్కులు తెచ్చుకుని ఎంపిక అయినందుకు విద్యార్థికి శాసనసభ్యులు అభినందనలు తెలిపారు. విద్యార్థులు నరేంద్ర కుమార్ ను ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ ఎస్ రాజు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ డిసెంబర్ 15 ప్రజా పలన ప్రతినిధి:పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 69వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు ,ముందుగా అమరజీవి చి త్రపటానికి –గాంధీ సెంటర్లోని పొట్టిశ్రీరాములు విగ్రహా నికి శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రా వు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించినప్పటికీ తెలుగు ప్రజల హృదయాల్లో పొట్టి శ్రీ రాములు నేటికీ అమరజీవి గానే మిగిలి ఉన్నారని తెలిపారు ,భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు కృషి మరువలేనిదన్నారు.అదేవిధంగా మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధ రణ అనే ఆశయాల కోసం అనితర కృషి చేశారని ఆ యన గుర్తు చేశారు ,పొట్టి శ్రీరాములు అందించిన స్ఫూర్తితోనే దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖ ర్ రెడ్డి కులమతాలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందగా ప్ర స్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కూ డా అదే బాటలో ముందుకు సాగుతున్నారని ఎమ్మె ల్యే పేర్కొన్నారు ,నేటి యువత పొట్టిశ్రీరాములును ఆదర్శంగా తీసుకొని పోరాట స్ఫూర్తితో ముందుకు సా గాలని ఆయన సూచించారుఈ కార్యక్రమంలో స్థా నిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్త లు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాదెండ్ల మండల కార్మిక విభాగం అధ్యక్షులు గా పుట్టా నాగేశ్వరావు



చిలకలూరిపేట :(ప్రజాపాలన ప్రతినిధి)పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్ ఆవరణలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యాలయం లో గణపవరం గ్రామానికి చెందిన పుట్టా నాగేశ్వరావు ను నాదెండ్ల మండలం కార్మిక విభాగం అధ్యక్షులు గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆయన నియామక పత్రాన్ని నియోజకవర్గ అధ్యక్షులు మాదాసు పృధ్వీరాజ్ సాయి , నందా యువసేన కోస్తాంధ్ర జిల్లాల అధ్యక్షులు నాగేశ్వరరావు , నియోజకవర్గ కార్యదర్శి వెంకటేశ్వర రాజు చేతుల మీదగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను బీసీ కార్మికుల కోసం బీసీల బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు మల్ల కోటేశ్వరరావు ( కోటి ), నాదెండ్ల మండల యువజన విభాగం అధ్యక్షులు శ్రీనివాస రావు , చిలకలూరిపేట మండల అధ్యక్షులు మహేంద్ర మరియు యువజన విభాగం నాయకులు విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు



## వేపాకులు, గోతాలు ధరించి వస్త్రవ్యాపారుల నిరసన



చీరాల(ఒంగోలు) : చీరాలలో వస్త్రవ్యాపారులు చేస్తున్న నిరసన ప్రదర్శనలు తారాస్థాయికి చేరాయి. ఈరోజు ఆదిమ మానవులవలె వేపాకులు, వేపమండలు ధరించి, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ వస్త్రవ్యాపారుల నాయకులు చిన్ని లీలాధరరావు మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన వ్యాట్‌టాక్స్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతంచేస్తామని తెలిపారు. ఇప్పటికే మూడుశాతం టాక్స్‌విధిస్తున్నారని, దానిని ఐదునుండి పదమూడుశాతం పెంచుతూ, ఉత్తర్వులను వెలువరించడం దారుణమని, ఇవన్నీ అంతిమంగా వినియోగదారునిపై పడే అవకాశం ఉందని తద్వారా కొనుగోలుదారులు లేక వ్యాపారులు రోడ్డున పడే అవకాశం ఉందని తెలిపారు. గోతాలు ధరించి, శ్యామ్ ప్రసాద్ అనే వస్త్ర వ్యాపారుడు చేసిన వినూత్న నిరసన ప్రదర్శన, ప్రత్యేకఆకర్షణగా నిలిచింది. ది టెక్స్ టైల్స్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిన్ని లీలా ధర రావు, సెక్రటరీ పోలిశెట్టి వేణుగోపాల్, ఎం జి సి మార్కెట్ ప్రెసిడెంట్ శీరాంబుజ్జి, సెక్రటరీ తాతాకుమారస్వామి, ది టెక్స్‌టైల్స్ మర్చంట్స్‌అసోసియేషన్,మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్, బి వి.యస్,, కామధేను, ఆర్.ఆర్.రోడ్, వస్త్ర వ్యాపారుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనకార్యక్రమంలో, పలువురు వస్త్రవ్యాపారులు,పాల్గొన్నారు.

## తెదేపా కార్యాలయంలో శ్రీ పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు





కావలి డిశంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం అశువులు బాసిన శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంను తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా టిడిపి అడహక్ కమిటీ అధ్యక్షులు గుత్తి కొండ కిషోర్, ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర,కండ్లగుంట మధుబాబునాయుడు,గ్రంధి యానాది శెట్టి , బొట్లగుంట శ్రీహరినాయుడు, సుబ్బానాయుడు, బీద గిరిధర్‌లు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన కృషి మరువలేమని అంటరాని తనాన్ని ఎదిరించిన దీరుడు అని ఆయన చరిత్రలో నిలిచిపోయారని అంబేద్కర్‌లాగా సమసమాజ స్థాపనకు కృషిచేసారని స్వాతంత్ర్య సమరయోదుడు అని సంఘ సంస్కర్త అని గాంధేయవాది అని ఆయనను అభివర్ణించారు. ఈకార్యక్రమంలో జ్యోతి బాబురావు , కాకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా అధికారులకు సూచనలు



తణుకు ప్రజాపాలన ప్రతినిధి : తణుకు పట్టణంలో ది.21. 12.2021 న జరగ నున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ డా.బీ ఆర్ అంబేద్కర్ (రెవెన్యూ), జాయింట్ కలెక్టర్( హౌసింగ్ ) సూరజ్ గానోరె , ఆర్డీవో కొవ్వూరు ఎస్.మల్లిబాబు, తదితరులు. ఈ సందర్భంగా రెవెన్యూ, మునిసిపల్, హౌసింగ్, ఆర్ అండ్ బి, పోలీస్, తదితర శాఖల అధికారులకు సూచనలు చేశారు.

## కమీషనర్ ను కలసిన ఫ్లోర్ లీడర్ వేంకట సత్యనారాయణ ,రెహానా నాహీద్



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి, డిసెంబర్ 15: మైనారిటీలకు ఉపయోగపడేలా షాదిఖానా లైబ్రరి నిర్మించాలని కోరుతు 19 డివిజన్ కార్పొరేటర్ రెహానా నాహీద్ విజయవాడ మున్సిపల్ కమీషనర్ వేంకటేష్ ప్రసన్నను కలిశారు. అనంతరం కార్పొరేటర్ నాహీద్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ దేవినేని అవినాష్ సూచనల మేరకు వై ఎస్ ఆర్ సి పి ఫ్లోర్ లీడర్ వెంకట సత్యం తో కలసి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసన్న వెంకటేష్ ని కలిసి ఎన్నో సంవత్సరాల నుంచి మైనారిటీలు ఎదురు చూస్తున్నా షాదీఖానా గురించి చర్చించడం జరిగినదని తెలిపారు. అయితే అందరికీ ఉపయోగపడే లైబ్రరీ మరియు మైనారిటీలకు ఉపయోగపడేలా షాదీఖానా భవన నిర్మాణం చేస్తామని కమీషనర్ హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# యువత బంగారు భవిష్యత్తును మాదక ద్రవ్యాలు నాశనం చేస్తున్నాయి

## తల్లిదండ్రులూ మీరు గుర్తించాలి.. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ లీగల్ సర్వీస్ కౌన్సిల్ నేషనల్ వర్కింగ్ చైర్మన్ ఓరుగంటి సుబ్బారావు



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)దేశంలోని యువత బంగారు భవిష్యత్తును మాదక ద్రవ్యాలు నాశనం చేస్తున్నాయని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ లీగల్ సర్వీస్ కౌన్సిల్ నేషనల్ వర్కింగ్ చైర్మన్ ఓరుగంటి సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ ప్రస్తుత గణాంకాల ప్రకారం.. 25 ఏళ్లలోపు యువతే మాదకద్రవ్యాలకు అధికంగా బానిసలవుతుండటం ఆందోళన కలిగిస్తున్న అంశమని తెలిపారు. ఈ మత్తు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు సమాజంలో కుటుంబం గౌరవం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. మానసిక ఒత్తిళ్ల ప్రభావమో... తోటి స్నేహితుల ప్రోద్బలమో... కారణం ఏదైతేనేం...? పిల్లలు, యువతనూ మత్తుమేఘాలు కమ్మేస్తుకుంటు న్నాయని చెప్పారు. చాటు మాటు అంగళ్లు దాటుకుని పాఠశాలలు, కళాశాల ప్రాంగణాలకూ మాదక ద్రవ్యాలు విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు.

మొదట్లో సంతోషం.. చివరికి వ్యసనం

సాధారణంగా ఇష్టమైన పదార్థాలు తింటే సంతోషంగా అనిపిస్తుంది. నచ్చిన సంగీతం వింటే మదిలో నూతనోత్సాహం నిండుతుంది. మాదక ద్రవ్యాలు తీసుకుంటే కూడా సరిగ్గా ఇలాంటి అనుభూతులే కలుగుతుంటాయి. ఆనందం, సంతోషం, ధైర్యం, ఆత్మవిశ్వాసం వంటి భావోద్వేగాలను పెద్ద ఎత్తున ప్రేరేపించి దూకుడుతనాన్ని పెంచుతాయి. మాదక ద్రవ్యాలు మొదట్లో ఆనందం, సంతోషం కలిగిస్తుండొచ్చు గానీ క్రమంగా శరీరం ఆ ప్రభావాలు తట్టుకునే సామర్థ్యం సంతరించుకుంటూ వస్తుంది. ఫలితంగా మునుపటిలా సంతోషం, ఆనందం కలగవు. అందువల్ల మరింత ఎక్కువ మోతాదులో తీసుకోవాలనే కోరిక కలుగుతుంది. కొంతకాలానికి అది కూడా సరిపోదు. ఆ మత్తు మోతాదు మరింత పెంచుకునేలా ఉసిగొల్పుతోంది. తద్వారా... మెదడులోని నాడీ కణాల్లోనూ మార్పులు తలెత్తి... తరచూ మాదక ద్రవ్యాలు తీసుకోవడం మొదలవుతుంది. చివరికి అవి లేకపోతే ఉండలేని స్థితీ తలెత్తుతుంది. ఇదే చివరికి వ్యసనానికి దారిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారని ఓరుగంటి సుబ్బారావు వివరించారు.

తల్లిదండ్రులు గుర్తించాలి..

పిల్లలు మత్తుకు అలవాటైన విషయాన్ని తల్లిదండ్రులు మొదట్లోనే గుర్తించలేకపోతున్నారని తెలిపారు.

బడికి వెళ్లకపోవటం, మార్కులు తక్కువ రావటంతో పాటు విద్యాసంస్థల నుంచి హెచ్చరిక వచ్చాకే ఎక్కువ కేసుల్లో అసలు విషయం వారికి తెలుస్తోంది. తల్లిదండ్రులు మొదట్లోనే సరైన చికిత్స, కౌన్సెలింగ్ ఇప్పిస్తే పిల్లలు కోలుకునే వీలుంటుంది. మత్తు బారిన పడినవారిలో మార్పులు తీసుకు రావడంలోనూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులదే కీలక పాత్ర. గత విషయాలు గుర్తుచేయకుండా, సూటిపోటి మాటలనకుండా కొత్త జీవితం దిశగా వారిని మళ్లించాలి. చెడు స్నేహితుల్ని దూరం పెట్టాలి. ఫోన్‌లో వారి నంబర్లు తొలగించాలి. పశ్చాత్తాపంతో జనజీవనంలోకి రావాలనుకునే బాధితులను అన్ని విధాలా ఆదరించాలని సుబ్బారావు అన్నారు.

చికిత్స ఇలా..

సాధారణంగా మాదక ద్రవ్యాల వ్యసనం తీవ్రమైతే సైకియాట్రిస్టుల పర్యవేక్షణలో డీ-అడిక్షన్ కేంద్రాల్లో చేర్చి చికిత్స చేయాల్సి ఉంటంది. ముందుగా డ్రగ్స్ రకాలను బట్టి బెంజోడైజపీన్స్, నాల్‌ట్రెక్సాన్, మెథడాన్ వంటి మందులతో చేతులు కాళ్లు వణకడం, ఆందోళన వంటి లక్షణాలు తగ్గించడానికి ప్రయత్నిస్తారు. ఈ మందులు పెద్ద మొత్తంలో ఆరంభించడం ద్వారా క్రమంగా తగ్గించుకుంటూ వస్తారు. పరిస్థితి కుదురుకున్నాక పూర్తిగా ఆపేస్తారు. ఫలితంగా శరీరంలో మాదక ద్రవ్యాల దుష్ప్రభావం పూర్తిగా తగ్గిపోతుంది. ఉపశమనం లభిస్తుంది. కొందరు తిరిగి మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కావచ్చు. అందువల్ల యాంటి క్రేవింగ్ మందులు కూడా ఇస్తారు. ఇవి మాదక ద్రవ్యాలు తీసుకోవాలన్న కోరిక కలుగకుండా చూస్తాయని ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ లీగల్ సర్వీస్ కౌన్సిల్ వర్కింగ్ చైర్మన్ ఓరుగంటి సుబ్బారావు తెలిపారు.

# అఖిలపక్షం మాహాపాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ ర్యాలీ






కావలి డిశంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి : అమరావతి రైతులు చేస్తున్న పాదయాత్ర తిరుమల దేవస్థానానికి చేరుకొన్న సందర్భంగా కావలి తెలుగుదేశం పార్టీ మరియు అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ నందు గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఆర్‌డిఓ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించారు. అమరావతి రైతులు ఎన్నో కష్టాలు పడి నిర్విరామంగా రోజుల పాటు తిరుమల దేవస్థానానికి చేరుకున్నందుకు సంఘీభావంగా ఈర్యాలీని నిర్వహించారు. రైతులకు మార్గమధ్యంలో కాళ్ళకు బొబ్బలు వచ్చినా, కాళ్ళునొప్పులు వచ్చినా పాదయాత్రలో అధికార పార్టీ నాయకులు ఎన్నో ఆటంకాలు కలిగించినా దేనిని లెక్క చేయకుండా అమరావతి మా రాజదాని అంటూ రైతులు చేసిన పాదయాత్రకు మద్దతుగా ఏకైక రాజదాని అమరావతి ఉండాలని ఒకే రాష్ట్రం ఒకే రాజధాని అంటూ నినాదాలతో మొదల్కె అమరావతి నుంచి రైతులు హర్షధ్వానాలతో తిరుమలకు ర్యాలీగా చేరుకున్నారు. అమరావతిని రాజదానిగా ఉండాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆర్‌డిఓ కార్యాలయంలో అఖిలపక్షం నాయకులు అందరు కలిసి వినతి పత్రం అందచేసారు. ఈకార్యక్రమంలో అఖిలపక్షం నేతలు బీదా గిరిధర్, మాలేపాటి వెంకట సుబ్బానాయుడు, దామా అంకయ్య, పి పెంచలయ్య, కండ్లగుంట మదుబాబునాయుడు, గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబురావు, మన్నవ రవిచంద్ర, దేగా సత్యం, అన్నపూర్ణ శ్రీనివాసులు, బాలగురుస్వామి, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కల్లయ్య, కాకి ప్రసాద్, జగదీష్, దావులూరి దేవకుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## దింతనపాడు లో సర్పంచ్ దేవరపు సుమతి ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)యడ్లపాడు మండలం పరిధిలోని దింతన పాడు గ్రామంలో సర్పంచ్ దేవరపు సుమతి అధ్యక్షతన మరియు 8వార్డు నెంబర్ కొచ్చర్ల శ్వేత ఆధ్వర్యంలో రానున్న క్రిస్మస్ పండుగ సందర్భంగా ఎస్సీ కాలనీ నందు బుధవారం డ్రైనేజీ కాలవలు పూడిక తీయడం జరిగినది. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డ్ నెంబర్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో బాగా జరుపుకోవాలని నిర్ణయించుకుని గ్రామంలోనే ముందుగా కాలువలో పూడిక తీసివేయడం మరొక రోజు రోడ్డుకిరువైపులా పరిశుభ్రం చేయుట నిర్ణయించామని మరియు చలిజ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ భాగంగా రోడ్డుకిరువైపులా కాలువలపై బ్లీచింగ్ చెల్లిస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శోభన్ శోభన్ శంకర్ మరియు గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



## సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ సిల్వర్ మెడల్ విజేత విద్యాధర్ కు ఎమ్మెల్యే అభినందన

ప్రతిభ కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రోత్సహిస్తాం: ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ప్రతిభ కలిగిన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్పెయిల్ లో జరిగిన ప్రపంచ సీనియర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్(డబుల్స్) సిల్వర్ మెడల్ విజేత జె.బి.ఎస్.విద్యాధర్ ను ఆంధ్రప్రభ కాలనీలోని తన కార్యాలయంలో శాసనసభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ అద్భుతాలు సృష్టించే క్రీడాకారులు ఎందరో ఉన్నారని, క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించినప్పుడే వారికి సరైన గుర్తింపు దక్కుతుందని అన్నారు. క్రీడా రంగంలో రాణిస్తూ రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ పరంగా అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గడిచిన రెండున్నరేళ్లలో ఎంతో మంది క్రీడాకారులను సీఎం జగన్మోహన్ రెడ్డి గారు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తుచేశారు. పీవీ సింధూ, హాకీ క్రీడాకారిణి రజనీలను ప్రొత్సహించినట్లే ప్రతిభ కలిగిన ప్రతి క్రీడాకారుడిని ప్రొత్సహిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఎందరో క్రీడాకారులు అంతర్జాతీయ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, నగర పాలక సంస్థ సహకారంతో క్రీడాకారులకు కావలసిన అన్ని సదుపాయాలను కల్పిస్తామని మల్లాది విష్ణు గారు అన్నారు. విద్యాధర్ ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మేనేజర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు.

# భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతులు పొట్టి శ్రీరాములు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్షకు పూని ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పొట్టి శ్రీరాములు 69వ వర్ధంతి, మాజీ ముఖ్యమంత్రివర్యులు కొణిజేటి రోశయ్య సంస్మరణ కార్యక్రమాలు ఆంధ్రప్రభ కాలనీలోని ఎమ్మెల్యే గారి కార్యాలయంలో మల్లాది విష్ణు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సహా వివిధ కార్పొరేషన్ల డైరక్టర్లు, నియోజకవర్గ వైసీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇంఛార్జిలు పాల్గొని ఆ మహనీయుల చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకోసం జీవితాంతం కృషిచేసిన మహనీయులు అమరజీవి పొట్టిశ్రీరాములు అని కీర్తించారు. పట్టుదల, కార్యదీక్ష, నిబద్ధతకు ఆయన నిలువెత్తు రూపంగా నిలిచారన్నారు. ఆ మహనీయుడని త్యాగానికి గుర్తుగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నెల్లూరు జిల్లాకు అమరజీవి పొట్టి శ్రీరాములు జిల్లా అని నామకరణం చేసి ఆయన గౌరవాన్ని మరింత ఇనుమడింపజేశారన్నారు. గత ఐదేళ్ల చంద్రబాబు పాలన పొట్టి శ్రీరాములు ని గుర్తుచేసుకునే అవకాశం లేకుండా చేసిందని.. తెలుగు ప్రజల ఆకాంక్షలను నాడు చంద్రబాబు తుంగలో తొక్కారన్నారు. సంప్రదాయంగా వస్తున్న మన రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారన్నారు. తెలంగాణ ఏర్పడిన జూన్ 2ను ఏపీ చరిత్రలో చీకటిరోజుగా అభివర్ణిస్తూ నవనిర్మాణ దీక్షల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. కానీ సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అవతరణ దినోత్సవం, పొట్టి శ్రీరాములు గారి వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తూ తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని మల్లాది విష్ణు చెప్పుకొచ్చారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి గారు మాట్లాడుతూ.. తెలుగువాళ్లందరినీ ఒక్క తాటిపైకి తెచ్చిన పొట్టి శ్రీరాములు గారు ప్రతి తెలుగువాడి గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్న అమరుడని కీర్తించారు. వైసీపీ కార్పొరేటర్ జానారెడ్డి మాట్లాడుతూ.. రోశయ్య గారు తన ప్రసంగంతో ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధుల్ని చేసేవారని.. ఆయన విమర్శలు విలువలతో కూడుకుని ఉండేవన్నారు. రోశయ్య గారి జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని అన్నారు. మరో కార్పొరేటర్ శర్వాణీ మూర్తి మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు గారు తుదివరకు కూడా గాంధేయవాదిగా నిలిచి హరిజనోద్ధరణకు ఎంతగానో కృషిచేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఈ రాష్ట్రం ఏర్పడిందని.. ఆయన స్ఫూర్తితోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ ు ు ం ద ు క ు సాగుతోందన్నారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు జానారెడ్డి, శర్వాణీ మూర్తి, బాలిగోవింద్, కొంగితల లక్ష్మీపతి, పెనుమత్స శిరీష, ఉమ్మడి రమాదేవి, అలంపూర్ విజయలక్ష్మి, మోదుగుల తిరుపతమ్మ, యరగొర్ల తిరుపతమ్మ, ఇసరపు దేవి, ఉద్ధంటి సునీత, కుక్కల అనిత, కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్ పిల్లి కృష్ణవేణి, కోఆపరేటివ్ బ్యాంక్ డైరక్టర్లు నేరెళ్ల శివ, తల్లప్రగఢ సుబ్బారావు, నాయకులు గుండె సుందర్ పాల్, ఆత్మకూరు సురేష్, దర్శి వాసు, మైలవరపు రాము, టెక్కలి మల్లిఖార్జున్, నల్గొండ సుబ్బారావు, నాడార్స్ శ్రీను, కొల్లూరు రామకృష్ణ మరియు నగర నాయకులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన పాఠశాల ఏర్పాటు మనందరికీ గర్వకారణం

## శాసనసభ్యురాలు విడదల రజిని యడ్లపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనం ప్రారంభం



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)మీరంతా బాగా ఎదిగితే జగనన్న జన్మ సార్థకమైనట్లేనని శాసనసభ్యురాలు విడదల రజిని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. మండల కేంద్రం యడ్లపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాదిన్నర కిందట ఈ పాఠశాల దుస్థితి తన దృష్టికి వచ్చిందని చెప్పారు. గతేడాది జూన్‌లో అప్పట్లో రెకుల షెడ్డు, అది కూడా అద్దెకు నడుస్తున్న పాఠశాలను తాను పరిశీలించానని గుర్తు చేసుకున్నారు. అప్పట్లోనే అతి త్వరలో విద్యార్థులకు నూతన భవనం వచ్చేలా చూస్తానని తాను హామీ ఇచ్చానని తెలిపారు. ఆ వెంటనే పాఠశాల నిర్మాణం కోసం స్థలాన్ని వెతికామని, నిధులు కూడా మంజూరు చేయించామని చెప్పారు. గతేడాది ఆగస్టులో పాఠశాల భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. ఏడాది తిరిగేలోగా భవనాన్ని ప్రారంభించు కోగలిగామని వెల్లడించారు. ఇదంతా వైఎస్ జగనన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. పాఠశాల దుస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లగానే.. నిధులు మంజూరుచేసి పనులు పూర్తయ్యేలా చేశారని వివరించారు. ఇప్పుడు అద్భుతమైన భవనంలో విద్యార్థులు చదువుకునే వీలు కలిగిందని పేర్కొన్నారు.

నాణ్యమైన చదువుల కోసం ఎన్నో పథకాలు

పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించేందుకు తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలుచేస్తున్నదని ఎమ్మెల్యే తెలిపారు. మన రాష్ట్రానికి వస్తున్న ఆదాయంలో రూపాయికి ఏకంగా 20 పైసలు విద్యారంగం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖర్చు చేస్తున్నారని తెలిపారు. జగనన్న విద్యాకానుక, నాడు– నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, విద్యావసతి.. ఇలా ఎన్నో పథకాలు ఈ రోజు రాష్ట్రంలో విద్యార్థుల ఉజ్వల భవితకు ఊతంగా అమలవుతున్నాయని వివరించారు. అన్నింటికి మించి అమ్మ ఒడి పథకం ఎన్నో సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు. పిల్లలంతా చదువులకు వెళ్లేలా ఈ పథకం తోడ్పాటును అందిస్తున్నదని వివరించారు. దేశంలోనే విద్యా విప్లవం సాధించిన రాష్ట్రంగా ఈ రోజు మన ఆంధ్రప్రదేశ్ నిలిచిందంటే ఆ ఘనత కచ్చితంగా జగన్ గారికే దక్కుతుందన్నారు. ఎంపీపీ తలతోటి ఝాన్సి మాట్లాడుతూ రూ. 1.5 కోట్ల నిధులతో అత్యాధునికంగా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు ముక్తా వాసు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్యనభ్యసిస్తున్నవారంతా అదృష్టవంతులని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ కల్లూరి బుజ్జి మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ హయాంలో చదువుకుంటున్న పిల్లలను గురించి పట్టించుకున్న నాథులే లేరని, ఇప్పుడు పేదలంతా హాయిగా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంజనేయులు, ఎంపీడీఓ మాధురి,తహశీల్దార్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు గడ్డిపాటి శివపార్వతి,యడ్లపాడు మండల జడ్పీటీసీ ముక్తా వాసు,ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్,సర్పంచ్ లు కారుచోల హేమ,సుబ్బారావు,నరసింహ రాజు, ఎంపీటీసీ కీర్తి అరుణ్,సయ్యద్ సుభాని,మండల అధ్యక్షుడు కల్లూరి విజయకుమార్,మున్సిపల్ చైర్మన్ రఫాని,నాయకులు మాదం శ్రీనివాసరావు, కర్నాటి సుబ్బారావు, ఆలోకం లక్ష్మీనారాయణ,గౌరీ హనుమంతరావు, జాకీర్, శేషయ్య,పావులూరి వాసు,శ్యాం పాల్,సాంబయ్య,మద్దూరి భాస్కర్ రెడ్డి,జాజుల రామారావు,మరియు పలువురు పాల్గొన్నారు.

## లేఅవుట్లలో మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలి: ఎమ్మెల్యే మల్లాది



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి :జగనన్న లే అవుట్లలో మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తిచేయాలని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణు అన్నారు. సూరంపల్లి, కొండపావులూరు ప్రాంతాలలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలను సబ్ కలెక్టర్ ప్రవీణ్ చంద్ గారితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. పేదలకిచ్చిన ఇళ్లస్థలాల లేఅవుట్లను చదును చేసే ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశించారు. లేఅవుట్లలో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. వారానికి రెండు దఫాలు అధికారులు లేఅవుట్లను పరిశీలించి తగు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. మరోవైపు సింగ్ నగర్ కు బస్టాండ్ మంజూరు అయిందని.. దీని ద్వారా రాబోయే రోజుల్లో ఆయా లేఅవుట్లకు ప్రయాణం సులభతరం కానుందని వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట నార్త్ ఎమ్మార్వో దుర్గాప్రసాద్, నార్త్ డిప్యూటీ తహశీల్దార్ చంద్రమౌళి, హౌసింగ్ డీఈ రవికాంత్, గన్నవరం డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, గన్నవరం సర్వేయర్ వర్మ, రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితుల పునరావాస గ్రామాం లో పర్యటించిన జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి



జంగారెడ్డిగూడెం. ప్రజాపాలన ప్రతినిధి :బుధవారం జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామం లో పోలవరం ప్రాజెక్ట్ బాధితుల కొరకు నిర్మించిన నిర్వాసితుల కొలని ని ఆయన పరిశీలించారు. ఈ కాలనీలో నిర్వాసితులకు నిర్మించిన ఇల్లు ,మౌలిక వసతులు ఆయన పరిశీలించారు.ఈ గ్రామంలో 3905 గృహాలు ఉన్నాయి ఈ గృహాలకు రోడ్లు , డ్రైనేజీలు ,విద్యుత్ సౌకర్యం, మంచినీటి సదుపాయం ఇతర సౌకర్యాలను ఆయన పరిశీలించారు ఆయన వెంట పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ ఓ.ఆనంద్ ,గృహ నిర్మాణ శాఖ ఈ ఈ బి తారాచంద్ , డీ ఈ లు , ఏ ఈ తదితరులు పాల్గొన్నారు .

## పెనమలూరు చోరీ నిందితులు అరెస్ట్

విజయవాడ: పెనమలూరు పోలీసు స్టేషను పరిధిలో జరిగిన చోరీ నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ హర్షవర్ధన్ వెల్లడించారు. నిందితుడి నుంచి రూ.9.72 లక్షలు నగదు, 6.7 గ్రాముల బంగారు ఉంగరం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులు గుంటూరుకు చెందిన వేముల శ్రీను, వేముల మహేష్ గా గుర్తించారు. గతంలో శ్రీను కొవ్వూరులో దొంగతనం కేసులో నిందితుడుగా ఉన్నట్లు పేర్కొన్నారు. తన భార్య పనిచేస్తున్న ఇంట్లోనే దొంగతనం చేశాడు. హైదరాబాదు వెళ్ళేందుకు బంగారు రింగు అమ్మాలని ప్రయత్నించి శ్రీను పట్టుబడినట్లు పేర్కొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన ముఖ్యమంత్రి , వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని



జంగారెడ్డిగూడెం ప్రజాపాలన ప్రతినిధి : తాడువాయి దగ్గర ఆర్టీసీ బస్సు జల్లేరు వాగులో బస్సు బోల్తా పడిన సంఘటన లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి , వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని).బుధవారం జంగారెడ్డిగూడెం మండలం జిల్లేరు వాగు బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాదం సంభవించిన సంఘటనలో 47 మంది ప్రయాణికులు ఉన్నారని ,26 మంది గాయపడ్డారు వారందరికీ చికిత్స చేయడం జరుగుతుందని చిన్న చిన్న గాయాలు తగిలిన వారికి చికిత్స చేసి ఇంటికి పంపించడం జరిగిందని తొమ్మిది మందికి తీవ్రగాయాలు గాయాలు అయ్యాయని వారికి కి వైద్య అధికారులు మెరుగైన చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అన్నారు . అందులో ఇద్దరు ని ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడం జరిగిందని ఆయన తెలిపారు . ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి సీనియర్ డాక్టర్లను రప్పించి ఇక్కడ వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు .తొమ్మిది మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోడం జరిగిందని మంత్రి తెలిపారు.బుధవారం ప్రమాదం జరిగిందని తెలియటం తో హుటాహుటిన సంఘటన ప్రాంతం తాడువాయి కి అధికారులు లు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అశ్వారావుపేట నుండి జంగారెడ్డిగూడెం వచ్చుచున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు తాడవాయి వద్ద వాగులో బ్రిడ్జి పైనుంచి పడిందని ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు .ప్రమాదానికి కారణాలు తెలుసుకోవడానికి జంగారెడ్డి గూడెం ఆర్డిఓ ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందని ఆయన తెలిపారు. బస్సులో ప్రాథమిక సమాచారం మేరకు 47 మంది ఉన్నారన్నారు.అధికారులు అందరూ సహాయ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారని, ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారాన్ని ప్రకటించడం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, గాయపడిన వారికి మెరుగైనవైద్యం అందే విధంగా చర్యలు తీసుకో కావాలని అధికారులను ఆదేశించా మన్నారూ . ఈ కార్యక్రమంలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ,చింతలపూడి శాసనసభ్యులు ఉన్న మట్ల ఎలిజా , పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు ,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు , రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్ కాలేజ్‌లో విజయవంతముగా ముగిసిన రోబోటిక్స్‌వర్క్‌షాపు



చీరాల(ఒంగోలు) : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాలలో కళాశాల టెక్నికల్ క్లబ్ వారి ఆధ్వర్యములో, 2021 డిసెంబర్ 14, 15 తెదీలలో రోబోటిక్స్ పై రెండు రోజుల వర్క్ షాపు , విజయవంతముగా ముగిసినట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణ రావు ఒక ప్రకటనలో తెలిపారు.ఎలక్ట్రో క్లౌడ్ లాబొరేటరీస్ వారి ఆధ్వర్యములో , రోబోటిక్స్ పై రెండు రోజుల వర్క్ షాపు నిర్వహించినట్లు, కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణు గోపాలరావు తెలిపారు. ఈ వర్క్ షాపులో విద్యార్థులకు ఆర్డినో సాఫ్ట్ వేర్ ను నేర్పించి, రోబోట్ అసెంబ్లింగ్, మల్టీ పర్పస్



రోబోట్, లైన్ పాలోయర్, ఎడ్జి ఎవాయిడర్, ఆబ్జక్ట్ ఎవాయిడర్, ఆండ్రాయిడ్ ఆఫ్ కంట్రోల్ రోబోట్, వాయిస్ కంట్రోల్ రోబోట్ లపై విద్యార్థులకు అవగాహన కల్పించి, వాటితో ప్రయోగాలను నిర్వహించారని తెలిపారు. ఈ వర్కషాపు నందు ఇ.ఇ.ఇ, మెకానికల్, ఇ.సి.సి, సి.యస్.ఇ విభాగాలలో, 3వ, 4వ సం. చదువుతున్న, సుమారు 250మంది విద్యా ర్థిని విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ వర్క్ షాపునకు డా.యస్ ఇంద్రనీల్ కన్వినర్ గా వ్యవహరించారు. ఎలక్ట్రో క్లౌడ్ లాబొరేటరీస్ నుండి సుమంత్ కుమార్ జా, రాజేష్ చౌదరి, ప్రణవమ కుమార్ దాస్, హర్ద్ విశ్వకర్మలు పాల్గొన్నారు. కార్యక్రమములో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



నరసాపురం, డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) :అందరి సమిష్టి కృషితో సహకార సంఘాలను బలోపేతం చేసి రైతులకు మేలుజరిగేలా కృషి చేయాలని డిసిసిబి చైర్మన్ పి.వి.యల్. నరసింహరాజు అన్నారు. నర్సాపురం నియోజకవర్గ స్థాయి కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులతో బుధవారం స్థానిక రాయపేటలోని జిల్లా సహకార బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయంలో డిసిసిబి చైర్మన్ పి.వి.యల్.నరసింహారాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి అధ్యక్షులు, కార్యదర్శులు తమవంతు సహకారం అందించాలన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా సేవలు ఉండాలని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సహకార రంగాన్ని బలోపేతం చేసేవిధంగా కృషి చేస్తున్నారని ఆయన ఆశయాలకు అనుగుణంగా సహకార రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని ఆయన కోరారు. శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ సహకార సంఘాలు బలోపేతంగా ఉంటే రైతాంగం బలంగా ఉంటుందన్నారు. సహకార సంఘాలను బలోపేతం చేసిన ఘనత వైయస్ రాజశేఖర్రెడ్డికే దక్కిందన్నారు. 2006 సంవత్సరంలో బ్యాంకులు దివాలా తీసేసమయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి రుణమాఫీ చేయడం వల్ల బ్యాంకులు నిలదొక్కుకున్నాయన్నారు. సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు, సమిష్టిగా కృషిచేసి సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి.సి.యం.యస్.చైర్మన్ వేంద్ర వెంకట స్వామి, డి.సి.సి.బి. సిఇవో డాక్టర్ శ్రీదేవి, డి.సి.సి.బి.డైరెక్టర్ జాన్ కెనడి, జెడ్.పి.టి.సి.బొక్కా.రాధాకృష్ణ, అధ్యక్షులు షేక్. బలి మస్తాన్, దొంగ మురళీ, మోటుపల్లి రామ భాస్కర రావు, పోలిశెట్టి.బాబా, వివిధ బ్యాంకుల చైర్మన్లు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## చెంచుగాని పాలెం పరిశుభ్రత లో రాఘవులు



కావలి డిశంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి :చెంచుగానిపాలెం లో ఇటీవల కురిసిన వర్షాలకు వీధులన్నీ భీభత్సమై అపరిశుభ్రమైన వాతావరణం నెలకొనడంతో జెడ్ పి టి సి జంపాని రాఘవులు స్వయం గా చర్యలు చేపట్టారు. కార్యదర్శి రమాదేవి తో కలిసి జెసిబి తో రోడ్లు బాగు చేయించి, మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకున్నారు.పారిశుద్ధ్యం పై ప్రజలు కూడా పంచాయతీ కి సహకరించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని గ్రామస్తులను చైతన్య పరిచారు. మండలంలో కూడా పారిశుధ్యం పై తగిన చర్యలు తీసుకోవాలని యం.డి.ఒ సుబ్బారావు కి సూచించినట్లు రాఘవులు తెలిపారు.


## రాష్ట్ర మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)కు అదనంగా సినిమాటోగ్రఫీ శాఖ కేటాయింపు



అమరావతి ప్రజాపాలన ప్రతినిధి ,15 డిశంబరు: రాష్ట్ర రవాణా మరియు సమాచార పౌర సంబంధాల శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న పేర్ని వెంకట్రామయ్యకు (నాని) రాష్ట్ర ప్రభుత్వం సినిమాటోగ్రఫీ శాఖ బాధ్యతలను కూడా కేటాయించింది. ఈమేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.సమీర్ శర్మ ప్రభుత్వ ఉత్తర్వులు జిఓఎంఎస్ సంఖ్య 144 ద్వారా రాజపత్రం (గెజిట్ నోటిఫికేషన్) జారీచేశారు.

## అమరావతి పోరాటంకు చరిత్ర లో అగ్రస్థానం

**మాజీ జడ్ పి టి సి బీద గిరిధర్**



కావలి, డిసెంబర్ 15( ప్రజాపాలన ప్రతినిధి) :అమరావతి రాజధాని గా కొనసాగించాలని రైతులు చేస్తున్న పోరాటం కు చరిత్ర లో అగ్రస్థానం దక్కిందని తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత మాజీ జడ్ పి టి సి బీద గిరిధర్ యాదవ్ పేర్కొన్నారు. మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా బుధవారం కావలి లో నిర్వహించిన సంఘీభావం కార్యక్రమం లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 720 రోజులు గా దీక్ష లు చేస్తూ తమ ఆశయం ఫలించాలని కోరుతూ న్యాయ స్థానం టు దేవస్థానం పాదయాత్ర భవిష్యత్తులో ఎన్నో ఉద్యమాలకు స్ఫూర్తి దాయకం అవుతుందని అన్నారు. పాదయాత్ర కు అధికారికంగా ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఓర్పు తో అమరావతి రైతులు తమ ఆశయం సాధించారని గిరి పేర్కొన్నారు. పాదయాత్ర కు దారి పొడవునా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చి న ప్రోత్సాహం మరువలేనిదని అన్నా రు. ప్రజలు ఇప్పటికే మానసికంగా అమరావతి అని సిద్ధం అయిన తరుణంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని గిరిధర్ డిమాండ్ చేశారు. ఎన్ని త్యాగాలకైనా తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.



# ప్రీమియర్స్ లో 'పుష్ప' తగ్గేదే లే..!




అల్లు అర్జున్ – సుకుమార్ కాంబినేషన్ లో తెరకెక్కిన ''పుష్ప'' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. క్రిస్మస్ పండక్కి వారం ముందుగా ఈ శుక్రవారం (డిసెంబర్ 17) 'పుష్ప: ది రైజ్' వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా విడుదల కానుంది. అయితే అంతకంటే ముందే భారత కాలమానం ప్రకారం గురువారం యూఎస్ లో ప్రీమియర్స్ పడనున్నాయి. సినిమా ఫస్ట్ టాక్ బయటకు వచ్చేది ప్రీమియర్స్ ద్వారానే కాబట్టి.. పుష్ప మాస్ పార్టీ కోసం అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అడ్వాన్స్ బుకింగ్స్ లో 'పుష్ప' పార్ట్– 1 సినిమా అదరగొడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ప్రీ బుకింగ్స్ ఓపెన్ చేసిన కొన్ని గంటల్లోనే ఫస్ట్ డే దాదాపుగా అన్ని షోల టికెట్స్ అయిపోయి హౌస్ ఫుల్ బోర్డ్స్ పెడుతున్నారు. ఇక యూఎస్ ప్రీ బుకింగ్ సేల్స్ లోనూ పుష్ప తన రేంజ్ ఏంటో చూపించింది. ఒక గంటలోనే 350%ఖ% డాలర్లకు పైగా ప్రీ సేల్స్ తో దూసుకుపోతోంది. అయితే బన్నీ సినిమా ప్రీమియర్ షోలకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చిన రూమర్స్ అభిమానులను కాస్త కలవరపాటుకు గురిచేశాయి.'పుష్ప: ది రైజ్' ఫైనల్ కాపీ ఇంకా రెడీ కాలేదని.. సుకుమార్ దీనిపై వర్క్ చేస్తూనే ఉన్నారని ట్విట్టర్ వేదికగా రూమర్స్ స్ప్రెడ్ అయ్యాయి. ఇది ఎప్పటి నుంచో ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న అల్లు అర్జున్ అభిమానులతో పాటుగా సినీ ప్రియులను నిరుత్సాహ పరిచింది. అయితే దీనిపై యుఎస్ డిస్ట్రిబ్యూటర్స్ సోషల్ మీడియా వేదికగా డౌట్స్ క్లియర్ చేసారు. 'పుష్ప' సినిమా ప్రీమియర్ షోలు ఎట్టిపరిస్థితుల్లోనూ షెడ్యూల్స్ ప్రకారం ప్రదర్శించబడతాయని స్పష్టం చేసారు. దీంతో బన్నీ ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు.కాకపోతే యూఎస్ మరియు నార్త్ సర్కిల్స్ లో 'పుష్ప: ది రైజ్' సినిమాపై 'స్పైడర్ మ్యాన్: నో వే హోమ్' ప్రభావం పడే అవకాశం ఉంది. అయినప్పటికీ అల్లు అర్జున్ సినిమాకు హిట్ టాక్ వస్తే మాత్రం అక్కడ షోల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇక దక్షిణాదిలోబన్నీ సినిమాకు ఎలాంటి డోకా లేదు. ఇటీవల వచ్చిన 'అఖండ' సినిమా బ్లాక్ బస్టర్ గా నిలవడంతో.. కరోనా సెకండ్ వేవ్ తర్వాత టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న 'పుష్ప' సినిమా ఎలాంటి విజయాన్నినమోదు చేస్తుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా శేషాచలం అడవుల్లోని ఎర్రచందనం స్మగ్లింగ్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిన 'పుష్ప' చిత్రంలో అల్లు అర్జున్ పుష్పరాజ్ గా అలరించనున్నారు. రష్మిక మందన్నా హీరోయిన్ గా నటించగా.. ఫహద్ ఫాజిల్ – అనసూయ – సునీల్ – అజయ్ ఘోష్ – అజయ్ – ధనుంజయ కీలక పాత్రలు పోషించారు. దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. మిరోస్లా కుబా బ్రోజెక్ సినిమాటోగ్రఫీ అందించారు. ముత్తం శెట్టి మీడియా సహకారంతో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని – రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'పుష్ప: ది రైజ్' తెలుగు తమిళ మలయాళ కన్నడ హిందీ భాషలు కలిపి ప్రపంచవ్యాప్తంగా 3 వేలకిపైగా థియేటర్లలో విడుదల కానుంది.

# ఇంత గ్యాప్ రావడానికి కారణం అదే: ఎస్వీ కృష్ణారెడ్డి




ఎస్వీ కృష్ణా రెడ్డి తాను ఇండస్ట్రీకి వచ్చినప్పుడే అందరూ కుటుంబ సమేతంగా చూడదగిన సినిమాలు చేస్తానని చెప్పారు. ఆ తరువాత ఆయన అదే మాటకి కట్టుబడ్డారు. అందువలన ఫ్యామిలీ ఆడియన్స్ ఆయన సినిమాలకి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేవారు. ఒక వైపున కామెడీని మరో వైపున సెంటిమెంట్ ను సమానంగా నడిపిస్తూ ఆయన అనేక విజయాలను అందుకున్నారు. అలాంటి ఎస్వీ కృష్ణారెడ్డి 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే'లో మాట్లాడుతూ తన కెరియర్ కి సంబంధించిన అనేక విషయాలను ప్రస్తావించారు.''నేను మా ఊరు దాటిన దగ్గర నుంచి గైడెన్స్ అంతా కూడా అచ్చిరెడ్డిగారిదే. ఈ రోజుకి కూడా ఆయన నన్ను అంటిపెట్టుకునే ఉంటారు. నన్ను డిజైన్ చేసింది .. నేను ఎందుకు పనికి వస్తానో చెప్పింది .. దర్శకత్వం వైపు నడిపించింది అచ్చిరెడ్డిగారే. అందువల్లనే నేను వరుస సినిమాలు చేసుకుంటూ వెళ్లాను. అలా మా ప్రయత్నానికి భగవంతుడి అనుగ్రహం కూడా తోడైంది. ఎంత టాలెంట్ ఉన్నప్పటికీ అదృష్టం కలిసి రావాలి .. అదృష్టమే భగవంతుడి అనుగ్రహం. అది లేకపోతే ఎవరూ చేసేదీ ఏమీ ఉండదనేది నా అభిప్రాయం.సక్సెస్ వచ్చినప్పుడు పొంగిపోకూడదు .. కష్టం వచ్చినప్పుడు కుంగిపోకూడదు. ఆ విషయాన్ని వంటబట్టించుకోవడం వల్లనే నేను గర్వాన్ని తలకెక్కనీయలేదు. అన్ని రోజులు ఒకలా ఎప్పుడూ ఉండవు .. మనకంటే టాలెంట్ ఉన్నవారు ఎంతోమంది ఉన్నారు. అయితే అన్నీ నేనే చేసుకుంటూ మిగతా వాళ్లకి అవకాశం ఇవ్వలేదనే మాటను కొంతవరకూ నేను ఒప్పుకుంటాను. ఒకప్పుడు నేను వరుసగా 40 సినిమాలు చేశాను .. మరి ఇప్పుడు నాకు అవకాశాలు ఏవి? ఎవరు అవకాశం ఇస్తారు? అందుకే అవకాశం వచ్చినప్పుడు లాక్కోవాలి .. కుదిరినప్పుడు చేసుకోవాలి. నేను చేసింది అదే. పదేళ్ల గ్యాప్ వచ్చినా ఇటు ప్రేక్షకులు గానీ .. అటు ఇండస్ట్రీగాని నన్ను మరిచిపోలేదు .. అది నా అదృష్టం. ఇప్పటికీ నా గురించి .. నా సినిమాల గురించి మాట్లాడుకుంటున్నారు. నేను గానీ .. అచ్చిరెడ్డిగారు గాని ఆర్థికంగా బాగానే ఉన్నాము. ఒక దశ తరువాత సొంత సినిమాలు తీయకూడదని నిర్ణయించుకున్నాము. ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండటం వల్లనే గ్యాప్ వచ్చేసింది. నిజం చెప్పాలంటే ఇప్పుడు కూడా మేము సొంత సినిమాలు చేసుకోగలము. చాలామంది నిర్మాతలు ఆర్థికంగా చితికి పోవడం మేము మా కెరియర్ తొలినాళ్లలోనే చూశాము .. అందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాము'' అని చెప్పుకొచ్చారు.

# బ్రహ్మాస్త్రకు బాహుబలి రేంజు సీనుందా?





ప్రస్తుతం టాలీవుడ్ లో ఓ ఆసక్తికర చర్చ సాగుతోంది. వరుసగా పాన్ ఇండియా చిత్రాలు విడుదలవుతున్నాయి. పుష్ప తర్వాత సంక్రాంతి బరిలో మూడు పాన్ ఇండియా సినిమాలు వస్తున్నాయి. వీటన్నిటిలో బాహుబలి రికార్డుల్ని బ్రేక్ చేసే సినిమా ఏదీ? అన్న ఉత్కంఠ నెలకొంది.బాహుబలి స్టార్ ప్రభాస్ నటించిన రాధేశ్యామ్ తో పాటు రాజమౌళి ఆర్.ఆర్.ఆర్ .. పవన్ కల్యాణ్ – రానాల భీమ్లా నాయక్ సంక్రాంతి బరిలో ఉన్నాయి. వీటిలో ఏ చిత్రం బాహుబలి రికార్డుల్ని కొడుతుంది? అన్నది సస్పెన్స్.మరోవైపు బాలీవుడ్ నుంచి బ్రహ్మాస్త్ర లాంటి భారీ పాన్ ఇండియా చిత్రాన్ని రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నారు. నాలుగైదేళ్లుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రణబీర్ –అమితాబ్ – నాగార్జున లాంటి ప్రముఖ స్టార్లు నటించారు. ఆలియాభట్ ఇందులో కథానాయిక. ఇంతటి భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ సినిమా ఎందుకనో అంతకంతకు ఆలస్యమైంది. ఆయాన్ ముఖర్జీ లాంటి ట్యాలెంటెడ్ డైరెక్టర్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నా ఏదీ పూర్తి కావడం లేదు. 2022లో ఈ మూవీ విడుదలవుతుంది. కానీ రిలీజ్ తేదీపై స్పష్టత లేదు. ప్రస్తుతానికి మోషన్ పోస్టర్ ని విడుదల చేయనున్నారు. మోషన్ పోస్టర్ కు ముందు బిగ్ బి బ్రహ్మాస్త్ర గ్లింప్స్ ని విడుదల చేశారు. 15 డిసెంబర్ (నేడు) న్యూ ఢిల్లీలో జరిగే ప్రత్యేక అభిమానుల కార్యక్రమంలో మోషన్ పోస్టర్ను విడుదల చేయడానికి బ్రహ్మాస్త్ర టీమ్ ఇప్పటికే ఏర్పాట్లు చేసింది. బ్రహ్మాస్త్ర నిస్సందేహంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బాలీవుడ్ చిత్రాలలో ఒకటి. ప్రేక్షకులు ఈ భారీ చిత్రం విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా గ్లింప్స్ లో ఏం ఉందో పరిశీలిస్తే ఈ చిత్రంలో శివగా నటిస్తున్న రణబీర్ కపూర్ ప్రత్యేక శక్తితో ఒళ్లంతా నిప్పుతో భగభగ మండుతూ కనిపిస్తున్నాడు. అతడి శరీరం గొప్ప విద్యుత్ శక్తితో మెరుస్తోంది. చేతులు చాచి అతడు ఎనర్జీని సంగ్రహిస్తున్న పోస్టర్ ఉత్కంఠను పెంచింది. ఇది సూపర్ హీరో తరహా చిత్రమని అర్థమవుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక యాక్షన్–అడ్వెంచర్ మూవీని 2022లో తెలుగు– తమిళం– కన్నడ– మలయాళంలో విడుదల చేయనున్నారు. అయితే ఇన్నేళ్లలో బిగ్ బి కానీ రణబీర్ కానీ బాహుబలి రేంజు సినిమాని చేయలేకపోయారు. బాలీవుడ్ సహా ఇతర పరిశ్రమల్లోనూ ప్రయత్నించినా అంత ఈజీగా పనవ్వలేదు. బ్రహ్మాస్త్రను కూడా అన్ని భాషల్లో విడుదల చేసి బాహుబలి రేంజు హిట్టు కొట్టాలన్న ప్రయత్నం జరుగుతోంది. కానీ అది ఎంతవరకూ సఫలమవుతుంది? అన్నది వేచి చూడాలి.

# సమంత నెం.1 పొజిషన్ కంటిన్యూ




టాలీవుడ్ లో ఎంతో మంది కొత్త హీరోయిన్స్ తెరంగేట్రం చేస్తూనే ఉన్నారు. ప్రతి ఏడాది కొత్త హీరోయిన్స్ ఎంతో మంది ఎంట్రీ ఇస్తున్నారు.. పాత వారు మెల్ల మెల్లగా ఫేడ్ ఔట్ అవుతూ వెళ్తున్నారు. కాని కొందరు హీరోయిన్స్ మాత్రం కొత్త వారు ఎంత మంది వచ్చినా అలాగే కంటిన్యూ అవుతు న్నారు. దశాబ్ద కాలంగా టాలీవుడ్ లో కొందరు హీరోయిన్స్ టాప్ హీరో యిన్స్ గా కంటిన్యూ అవుతున్నారు. వారిలో సమంత.. తమన్నా.. అనుష్క.. కాజల్ లు ఉన్నారు. ఎంత కాలం అయినా కూడా వీరు అంటే అభిమానులకు మోహం మొత్తడం లేదు. వీళ్లు సినిమాలు చేసినా చేయకున్నా... పెళ్లిళ్లు చేసుకున్నా.. ఫ్లాప్ లు అవుతున్నా కూడా వారిని అభిమానులు ఆధరిస్తూనే ఉన్నారు. టాలీవుడ్ స్టార్స్ కు సంబంధించిన ర్యాంకింగ్స్ ను ఇచ్చే ఆర్మాక్స్ సంస్థ నవంబర్ నెలకు గాను తమ సర్వే ఫలితాన్ని విడుదల చేసింది.హీరోల విషయంలో ఎప్పటిలాగే టాప్ లో మహేష్ బాబు ఉన్నాడు. ప్రభాస్ నెం.2 స్థానంలో నిలిచాడు. హీరోల జాబితాతో పాటు హీరోయిన్స్ టాప్ 10 జాబితాను కూడా ఆర్మాక్స్ సంస్థ విడుదల చేసింది. ఈ జాబితాలో సమంత నెం.1 స్థానంను కొనసాగించింది. ఈ ఏడాది ఆరంభం నుండి ఆమె స్థానం పదిలంగానే ఉంటూ వస్తుంది. పెళ్లి.. విడాకులు.. సినిమాలు.. వెబ్ సిరీస్ లు ఇలా ఎన్నో విషయాలతో సమంత ఎప్పుడు మీడియాలో ఉంటూనే ఉంది. అందుకే ఆమె పాపులర్ స్టార్ గా అభిమానులు చెబుతున్నారు. సర్వే సంస్థ సమంతను నెం.1 గా చెబుతూ పేర్కొంటూ వచ్చింది. సమంత నెం.1 స్థానం లో కంటిన్యూ అవ్వగా రెండవ స్థానంలో కాజల్ అగర్వాల్ నిలిచింది. పెళ్లి చేసుకుని సినిమాలు తగ్గించినా కూడా కాజల్ ను అభిమానించే వారు చాలా మంది ఉన్నారు. నెం.3 స్థానంలో అనుష్క నిలిచింది. ఈమె సినిమాలు వచ్చి చాలా కాలం అవుతున్నాయి. అయినా కూడా ఆమెను అభిమానులు రెగ్యులర్ గా తల్చుకుంటూనే ఉన్నారు. ఇక నెం.4 స్థానంలో పూజా హెగ్డే నిచింది. ప్రస్తుతం టాలీవుడ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ అయిన పూజా హెగ్డే నెం.4 స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నెం.5 స్థానంను కీర్తి సురేష్ మరియు నెం.6 స్థానాలను సాయి పల్లవిలు దక్కించుకున్నారు. నెం.7 లో తమన్నా నిలువగా నెం.8 లో రష్మిక మందన్నా నిలిచింది. ఇక నెం.9 లో రకుల్ ప్రీత్ సింగ్ నిలువగా నెం.10 లో రాశి ఖన్నా నిలిచారు. ప్రస్తుతం వారు చేస్తున్న సినిమాల ఆధారంగా కాకుండా వారి స్టార్ డమ్ ఆధారంగానే.. అభిమానుల్లో ఉన్న ఆధరణతో వారికి స్థానాలు దక్కాయి.

# విక్కీ-క్యాట్ నిశ్చితార్థ ఫోటో వైరల్



డిసెంబర్ 9న రాజస్థాన్ లో జరిగిన వివాహం లో విక్కీ కౌశల్– కత్రిన జంట ఒకటైన సంగతి తెలిసిందే. పెళ్లి ఫోటోలు ఇప్పటికే అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. ఈ పెళ్లిని లీకులేవీ లేకుండా అత్యంత గోప్యంగా జరుపుకోవడం టాక్ ఆఫ్ ది టౌన్ అయ్యింది.కాస్త డిలే అయినా కానీ వీరి నిశ్చితార్థం నుంచి కొన్ని ఫోటోలు అంతర్జాలంలోకి వచ్చాయి. విక్కీ కౌశల్ –కత్రిన జంట సోషల్ మీడియా హ్యాండిల్స్ లో పెళ్లి ఫోటోలను విడుదల చేస్తున్నారు. ఇంతలోనే కత్రినా హెయిర్ స్టైలిస్ట్ డేనియల్ బాయర్ స్టార్ జంట ఫోటోలను పంచుకున్నారు. ది సగాయ్ అంటూ వ్యాఖ్యను దీనికి జోడించారు.కత్రినా – విక్కీ ఇద్దరూ తమ ఖరీదైన గులాబీ రంగు దుస్తులలో కవలలుగా కనిపించారు. ప్రేమించడం.. గౌరవించడం..ఆదరించడం..! అని కత్రినా కైఫ్ ఈ పోస్ట్ కి క్యాప్షన్ ఇచ్చింది.మనోహరమైన ఈ జంట చిత్రాలలో శృంగారభరితంగా కనిపించింది. సబ్యసాచి డిజైనర్ దుస్తుల్లో తళతళా మెరిసింది ఈ జంట. ఇవన్నీ కొన్ని సెకన్లలో అభిమానులు.. స్నేహితులలో వైరల్ కాగా.. హృదయ ఎమోజీలు వ్యాఖ్యలతో రిప్లయ్ లు వచ్చాయి. కత్రినా గులాబీ రంగు పూల నెట్ చీరను ధరించి.. పూల ప్రింట్ ఫిల్ స్లీవ్స్ బ్లౌజ్ తో తలపై ధరించే షీర్ వీల్ తో ఎంతో ప్రత్యేకంగా కనిపించగా.. చేతిలో గులాబీ పువ్వుల బొకే పట్టుకుని కనిపించింది. విక్కీ మరోవైపు పీచు రంగు షేర్వానీ ధరించి రాయల్ గా కనిపించాడు. పెళ్లి ఫోటోలతో పాటు నిశ్చితార్థ ఫోటో కూడా వైరల్ గా మారాయి.



Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com